

నేనిచ్చు నీళ్ళు త్రాగువాడెన్నడును దప్పిగొనడు; నేను వానికిచ్చు నీళ్ళు నిత్యజీవమునకై
వానిలో ఊరెడి నీటిబుగ్గగా ఉండును -యేసు
ఆధ్యాత్మిక మాస పత్రిక
మార్చి - 2009

# విషయసూచిక


| | | |
|---|---|---|
| నా కుటుంబము... | ఛీఫ్ ఎడిటర్ | 3 |
| చాలని నేను- | కంచర్ల ప్రభుదాసు, నెల్లూరు | 4 |
| నిత్యజీవజలము | నిత్యజీవజలము మాసపత్రిక సౌజన్యంతో | 6 |
| శాశ్వత రక్షణ | రెవ.డా॥కె.జోసఫ్, ఒంగోలు | 8 |
| మహాయజ్ఞము | రెవ.డా॥బి.శాంసన్, చెన్నై | |
| | రెవ.డా॥పి.జె.పంచరత్నం, నంద్యాల | 10 |
| నా దృష్టిలో మానాన్న | శ్రీమతి కమలమ్మ, పులివెందుల | 12 |
| మదర్ తెరీసా | శ్రీయడవల్లి ప్రసాదరావు, హైదరాబాద్ | 14 |
| విశ్వాసంలో ఓ మెట్టు | కొడవటికంటి | 16 |
| మార్చి నెల ప్రశ్న | హన్నాకృప డెస్క్ | 18 |
| ఇది పరిశుద్ధాత్మయేనా? | శ్రీ డేవిడ్ మింగ్స్, బైబిల్ ఉపదేశిని, చెన్నై | 19 |
| ఎలాగైనా అతన్నే..... | డా॥పి.సతీష్‌కుమార్, హైదరాబాద్ | 20 |
| పేరులేని బానిస | శ్రీమతి బి. విమలారెడ్డి, హైదరాబాద్ | 22 |
| అమృతధార | డా॥ కె. డేవిడ్‌లివింగ్‌స్టన్, మార్కాపురం | 24 |
| మత మార్పిడా? | ఎ.వై.ప్రభుదాసు, మంగళగిరి | 27 |
| సువార్తలలోని యేసు కథ | కొడవటికంటి | 29 |
| న్యూస్ | హన్నాకృప డెస్క్ | 31 |



**చిరునామా :**

**కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర**

చీఫ్ ఎడిటర్

**హన్నాకృప**

పోస్ట్‌బాక్స్ - 51, 54-1-23(ఎ)

కృపాదానంవీధి, క్లాపేట,

6వ లైను, ఒంగోలు- 1.


**హన్నాకృప**

**ఆధ్యాత్మిక మాస పత్రిక**


# HANNA KRUPA

**Christian Devotional Monthly Magazine**

**సంపుటి : 7** **సంచిక : 10**


ప్రభువగు యెహోవాయే నాకు బలము


Founder :

**Kodavatikanti Emmanuel Rajendra,** B.A.,B.L.,

Editor :

**Nathaniel R. Kodavatikanti,** B.Th.,M.A.,(M.Phil)

Cell : 9908822365

Hon. Editor :

**A.N.R. Zakkam**

D.G.M., SOMA Enterprises, Rajasthan

Hon. Advisor :

**Yadavalli Prasada Rao**

D.A.O.,G.H.M.C., Hyderabad

Patrons :

**Dr. Y.S. Purushotham Reddy**

Superintendent, Rajareddy Hospital Pulivendula

**Rev. Dr. K. Joseph**

Director, I.E.R.F. Ongole

**Bishop. Dr. M.S. Santhavardhan**

Director, Good News Messengers, Guntur


**ఆన్‌లైన్ అకౌంట్ నెం. : 10957294362**

**బ్రాంచి నెం. : 0890 స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

**కె. సామ్యేల్ రాజేంద్ర, కృపాదానంవీధి, క్లాపేట, ఒంగోలు**

**సెల్ : 9866716506**

సంపాదకీయం

16

# నా కుటుంబము

దేవుడైన యెహోవా -నరుడు ఒంటరిగా నుండుట మంచిది కాదు అని చెప్పి వానికి ఒక కుటుంబము ఏర్పాటు చేశాడు. హవ్వను తయారు చేయగానే వారిద్దరూ పిల్లలను కని భూమిని నింపి దానిని ఏలమన్నాడు.

వీరిద్దరూ కలసి ఉండి భూమిని నింపాలి. అది దేవుని ఆజ్ఞ. నీ తెలివి తేటలతో కాని, భవిష్యత్తులో మానవజాతిని సంరక్షించగలగటానికి గవర్నమెంటు చట్టముకాని, ఎక్కువ చదివాను చాలా అనుభవం నాకు ఉంది అని నేను నా కుటుంబము కొరకు ఏర్పాటు చేసిన ప్రణాళికలో ఏవి మానవ కుటుంబాన్ని సరిగా నడుపలేవు.

మిల్టన్ ఏమి వ్రాశాడో కాని, హవ్వ ఆదాముకు దూరమై ఆదామును విడచి ఒంటరిగా ఉన్నందువల్లనే దేవునికి శాశ్వతంగా దూరమై తన కుటుంబమును దూరం చేసింది.

కుటుంబ క్రమము కొరకు ఇద్దరూ ఒకే చోట, ఒకే ఆఫీసులో ఉద్యోగం అయితేనే చెయ్యాలి లేదా భర్త సంపాదన తోనే కుటుంబమును నడపాలి. ఇద్దరి జీతాలతో చాలా సంపాదించవచ్చు కాని ఏమి పోగొట్టుకుంటామో.

పదిహేను సంవత్సరాల క్రితం నా ఆఫీసులో పనిచేసే ఆమె ఒకసారి నాతో మాట్లాడుతూ తన స్నేహితురాలు బాగా చదువుకున్నది. ఇద్దరు పిల్లలున్నారు. భర్తకి గవర్నమెంటులో పెద్ద ఉద్యోగం. కాని తన పుట్టింటి ఊర్లో ఆమెకు ఉద్యోగం వచ్చింది. అందువల్ల కుటుంబాన్ని వదలి నాలుగు వందల కిలోమీటర్ల దూరంలో ఉద్యోగం చేస్తూ శని,ఆదివారాలు మాత్రమే తన కుటుంబముతో గడుపటానికి నిశ్చయించు కుందని చెప్పింది. ఆమె ఎవరో నాకు తెలియకపోయినా నేను నా పేరు చెప్పకుండా ఒక ఉత్తరం వ్రాశాను.

'నీ భర్త జీతముతోనే తృప్తిపడి ఇంటివద్దనే ఉండి భర్తను పిల్లలను చూసుకోమని, మనం ఈ లోకంలో కొంతకాలమే జీవిస్తాము. అది కూడా నీడలాంటి మన జీవితం తొందర్లోనే ముగిసిపోతుంది. కనుక డబ్బు, దర్పం, గొప్ప ఇల్లు, ఆస్తి మనకు ఇచ్చే సంతోషం ఏమీ ఉండదు' అని ఉత్తరం వ్రాశాను. మరలా రెండు నెలలు ఆగి మరో ఉత్తరం వ్రాశాను.

పది సంవత్సరాలు గడచిపోయాయి. నా ఆఫీసులో పనిచేసే ఆమె వేరే పనిలోకి వెళ్ళిపోయింది. నేను ఒక ఊరిలో ఒక మీటింగులో మాట్లాడిన తర్వాత ఒక స్త్రీ వచ్చి తన కొరకు ప్రార్ధన చెయ్యమని తన పెనిమిటి తనను తన పిల్లల్ని చూడటం లేదని వేరే చోట ఉన్నాడని ఏడుస్తూ చెప్పింది. వివరాలు తెలుసుకున్న తర్వాత పది సంవత్సరాల క్రితం నేను ఉత్తరం వ్రాసిన స్త్రీ ఈమేనని తెలుసుకున్నాను.

మానవ జీవితంలో దేవుడు ఒక్కో కుటుంబానికి ఒక్కో ప్రణాళిక ఏర్పాటు చేశాడు. దేవుని ప్రణాళికలో ప్రతి కుటుంబా నికి సరిపడే సంతోషకరమైన ప్రణాళికను ఏర్పాటు చేశాడు. ఆయా కుటుంబాలలోని వ్యక్తులందరికి ఒక్కో బాధ్యతను అప్పగించాడు.

మంచి చదువుల కోసం తమ పిల్లల్ని హాస్టల్సులో చేర్పించే తల్లిదండ్రులు వారి కుటుంబ విషయములో దేవుని ప్రణాళికను వెక్కిరించిన వారవుతారు. పెద్ద చదువులు, హోదా అన్ని మానవ జీవితానికి కుటుంబానికి ఏమి తెచ్చి పెట్టలేదు.

ఒక ఇంట్లో తండ్రి తన బిడ్డల భవిష్యత్తు విషయము ఏ విధంగా ప్రవర్తిస్తాడో వారి బిడ్డలు పెరిగి పెద్దయి వారి కుటుంబాలు ఏర్పరచుకున్న తర్వాత అదే బాటలో తమ కుటుంబాలను నడుపుతారు. కనుక దేవుడు మనకు ఏర్పాటు చేసిన కుటుంబములోని అంటే భార్యాభర్త, పిల్లలు కలసి ప్రభువులో జీవిస్తూ ప్రేమానురాగాలు పంచుకుంటూ ఓర్పు క్షమ తర్ఫీతు చేసుకుంటే...

"నెమ్మదిగల ఇండ్లు నిజసౌఖ్యకాలములు
ఇమ్మహి ఫలియించు నైశ్వర్యధికముల్
ఇమ్ముగ కలిగిన హృదయులమై
వందనమ్ములు రుణపడి యున్నాము నీకు" అనే వచనం అర్థమవుతుంది.

నా స్నేహితుడు ప్రసాదరావు ప్రభువులోనికి వచ్చిన తర్వాత నాతో ఫోనులో మాట్లాడుతూ (ఆయన పెద్ద ఆఫీసరు. అంతేకాక అనేకులకు సహాయపడుతూ క్షణం తీరిక లేకుండా ఉంటారు) 'నేను ప్రతిరోజు అరగంట నా పిల్లలతో దేవుని విషయాలు ముచ్చటించడానికి సమయం పెడుతున్నాను' అన్నాడు.

మేమున్న పరిస్థితులలో అది సాధ్యం కాదు అను కుంటారు చాలామంది. ఒక్క విషయం మాత్రం యధార్థం. అదేమంటే ఒక మనిషి ఏదైనా చేయాలని నిశ్చయించుకుంటే అది తప్పక చేయగలడు. దేవునితో సహవాసము కలిగిన వారికి వారి కుటుంబము కంటే మాధుర్యమైన పరిస్థితి ఈ లోకంలో ఈ జీవితంలో మరెక్కడా దొరకదు.

సాక్ష్యము

# చాలని నేను - చాలిన నా ప్రభువు



( రెవ. కంచర్ల ప్రభుదాసు )

1976వ సంవత్సరము ఆ ప్రాంతంలో మేము ఆ రాత్రి ఒక కట్టబడుచున్న ఇంట్లో ఉండగా ఒక తేలు నా భార్యను కుట్టింది. అయితే కృపామయుని హస్తము ఆ విషపు అపాయము నుండి కాపాడినది. నాలుగు రోజుల తర్వాత ఒక విచారమైన సంఘటన, ఆ ఇంటి యజమాని తేలు కుట్టి చనిపోవలసి వచ్చింది. ఆ ప్రాంతంలో డా॥ శ్రీ జయ సూర్యరాజుగారు, డా॥ శ్రీమతి శ్యామలమ్మగారు మమ్మెంతో ఆదరించారు. రాయలసీమ ప్రాంతాలలో అనేక సభలలో శాఖల మధ్య పరిచర్య చేయుచూ వాక్య పరిచర్యలో వాడబడు చుంటిని. నన్ను ఏ మాత్రము ఆటంక పరచక ఎంతో ప్రోత్స హించారు. ఆ రోజులలో కర్నూలు సి.సి. చర్చి వార్షికోత్స వములో వాక్యోపదేశకునిగా పిలువబడినాను. అక్కడ కాపరి రెవ. పులుకూరి జయకుమార్‌గారు నన్ను ఎంతో ప్రోత్స హించి మూడు దినములు వాక్యోపదేశకునిగా వాడుకు న్నారు. ఆ సమయంలో ఆరాధనకు హాజరైన కలెక్టర్ శ్రీ జయకర్ జాన్సన్‌గారు పాస్టరుగారి ద్వారా నన్ను పిలిపించు కొని పరామర్శించి, నేను పనిచేసే స్థలము, అవసరత గూర్చి ఎంతో ప్రేమతో అడుగగా, నేను పాణ్యం దగ్గర సిమెంట్ నగర్‌లోని మందిరములో పనిచేయుచున్నానని అక్కడ సంఘ కార్యక్రమాలకు, మందిరము కట్టుటకు, స్థలము ఇవ్వగలిగితే మందిరము కట్టుకుంటామని చెప్పి అడిగిన కొద్ది కాలము నకే కలెక్టరుగారు మాకు పది ఎకరాల స్థలమును పట్టాగా ఇచ్చారు.

మేము 1977లో రూ. 600/-లతో చాలా పెద్ద మందిరం కట్టుటకు విశ్వాసముతో ప్రారంభించాము. అప్పుడు డా॥ టి.జె.గ్రిఫ్పన్‌గారు సమావేశ ప్రాజెక్టు నుండి కొంత సహకారము మరియు డా॥ శ్రీ జయసూర్యరాజుగారి బంధువర్గము కొంత సహకారం అందించారు. మాతో బాటుగా యౌవనస్తులు శ్రమదానము చేసి కొండలలో అందమైన రాళ్ళతో మందిరమును 1979లో పూర్తి చేయ గలిగినాము. ఈ మందిరాన్ని సిలువ ఆకారములో నిర్మించి నాము. ఇందులో 400 మంది కూర్చోగలరు. ఆ దినము లలో అమితమైన ప్రేమకలిగిన దేవుడు మమ్ము ఎంతో బలముగా వాడుకున్నాడు. ఆ సంఘానికి శ్రీ శేషం ప్రకాశం గారు కార్యదర్శిగా, శ్రీ ప్రభుదాసుగారు ట్రెజరర్‌గా ఎంతో కృషిచేశారు. డా॥టి.జె.గ్రిఫ్పన్‌గారు అప్పటి జనరల్ సెక్రటరీ అయిన రెవ. బి. విక్టర్ ఇమ్మానియేల్‌గారితో కలిసి ప్రతిష్ఠిం చాము. ఈ విధంగా సువార్త సేవలో సాగుతూ ఏ.సి.టి.సిలో బి.టి.హెచ్. చదువుతున్నాను. ఆ సమయంలో ఏలూరు నుండి శ్రీ యం.బెనార్డ్‌గారు, సుశైలంగారు మా దగ్గరకు వచ్చి సంఘకాపరిగా ఏలూరు రావాలి అని, మీరు అనుమతి పొంది వెంటనే రాగలరు అని కోరినారు. కాని మేము నంద్యాల పొలము వారు పొల సంఘ బాధ్యతలు వేరే ఎక్కడికి మార్చకుండ సిమెంట్‌నగర్‌లోనే వుంచారు. కాబట్టి పొల బాధ్యతలు అప్పగించి నన్ను ఎక్కడికి మార్చకుండ సిమెంట్ నగర్‌లోనే ఉంచారు. కాబట్టి పొల బాధ్యతలు వేరే వారికి అప్పగించే వరకు సిమెంట్‌నగర్‌కు మరొక కాపరి వచ్చే వరకు వుండి తర్వాత వస్తాను అని చెప్పాను. ఇక్కడ నాకు మూడు పదుల వయస్సు దాటక మునుపే, 'చాలని నన్ను చాలిన ఆ ప్రభువైన క్రీస్తు' నాతో ఒక కరివేన సంఘ స్థాపనకు సిమెంటు నగర్‌లో మందిర నిర్మాణమునకు, స్కూలు స్థాపనకు, తన పనిలో నన్ను సాధనగా వాడుకున్న ప్రభువైన క్రీస్తుకు ఎంతో స్తుతులు చెల్లిస్తున్నాను. ఆనాడే నేను నేర్చుకున్నాను. "మన ప్రతిభల ద్వారా మనము ఆయన కార్యములు చేయలేము" గాని...

ఆయన ప్రతిభయందలి మన విశ్వాసమునుబట్టి ఆయన కార్యాన్ని మనము తలపెట్టగలమని. తదుపరి 1979లో డిసెంబరు ఆఖరి దినములలో నేను ఏలూరు తెలుగు బాప్టిస్టు సంఘ కాపరిగా మా పరిచర్యను ప్రభువు ప్రారంభింప చేశాడు. 1979లో ఆఖరి దినముల నుండి 1984 జూన్ వరకు ఏలూరు తెలుగు బాప్టిస్టు సంఘములో ప్రభువైన యేసు నన్ను బలపరచి నన్ను వాడుకున్నాడు. ఈ సంఘము రెవ. శ్రీ మాదాసు ఫిలిప్పుగారి సేవాఫలముగా స్థాపింపబడి ఇశ్రాయేలుపేట కండ్రిగగూడెంలో వున్న కొద్దిమంది బాప్టిస్టులను సేకరించి పట్టణములో నడిబొడ్డు అయిన ఫతేబాద్‌లో రెవ. శ్రీ.బి.ఆర్ మోజెస్‌గారి

ఆధ్వర్యమున ఏర్పాటు చేయబడినది. శ్రీ పి. పాలస్‌గారి కుటుంబము, శ్రీ శేషంజాన్‌గారి కుటుంబాల కృషి ఫలితంగా పశ్చిమగోదావరి జిల్లాలో ఈ సంఘము నిలువగలిగింది. ప్రభువు మితిలేని కృప ద్వారా కొద్దికాలములోనే సంఘ జనాభా విస్తరించింది. మందిరము పెద్దదిగా విస్తరణ చేయబడి చుట్టూ ప్రాకారము నిర్మించబడినది. ఈ సంఘంలో ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేయుట ద్వారా సంఘ సభ్యత్వములు 20 అంతస్తులుగా విస్తరించింది. ఈ సంఘానికి అనుబంధమైన చిన్నపిల్లల సండేస్కూలు పట్టణములో ఐదు సెంటర్లుగా ఏర్పాటు చేయబడింది. శ్రీ భాస్కర్‌గారు, శ్రీ హెరాల్డ్‌గారు, శ్రీ ప్రసన్నగారు వీరందరూ ఎంతగానో ఈ సెంటర్ల కొరకు బహుగా శ్రమించి పనిచేశారు. అలాగే శ్రీ పి.పాలస్‌గారి కుమారులు, శ్రీ శేషం జాన్‌గారి సంతానం శ్రీ బి.టి.ప్రైజ్‌గారు, శ్రీ జోసఫ్‌గారు, సుశైలంగారు మరియు ఇంక ఎంతోమంది ఎంతగానో ప్రోత్సహించి సహకారము అందించినారు. శ్రీ, శ్రీమతి బెర్నడ్‌గారు యువజనుల మధ్య ఇచ్చిన ప్రోత్సాహము మమ్ములను ఎంతో బలపరచి ముందుకు సాగుటకు సహకరించినది. సంఘ యౌవన బృందము వారితో సైకిల్ మీదను మరియు నడకలతోను కృష్ణా, గోదావరి జిల్లాలో సువార్తను బహుగా వెదజల్లినాము. ఆనాటి సంఘ క్వయర్ వారు ఏలూరులో ఏ కార్యక్రమము జరిపిన బాప్టిస్టు క్వయర్ ప్రధమముగా సంఘాలన్నిటితో కలసి యునైటెడ్‌గా కార్యక్రమములు జరిగించేవారము. ఈ కార్యక్రమాలకు జిల్లాలో వున్న ఉన్నత అధికారులనందరిని పిలిచేవారము. ఈ సాంప్రదాయము నేటికిని కొనసాగుతుంది. క్వయరు వారు "సజీవ స్వరాలు" అనే క్యాసెట్‌ను రిలీజ్ చేయగలిగినారు. ఆనాడు సోషన్ వెల్‌ఫేర్ జాయింట్ డైరెక్టరు శ్రీ ఎన్. ప్రభాకర్‌గారి ద్వారా నిరుపేదలైన 300 మంది క్రైస్తవులకు కుట్టుమిషనులు, రిక్షాలు, తోపుడు బండ్లను ఇప్పించ గలిగాము. వరదలువంటి ప్రకృతి వైపరీత్యాలు జరిగిన సమయంలో సంఘ యూత్ ఏలూరు పట్టణంలో ఎంతో సంఘ పరమైన పరిచర్య అందించి ఎన్నో మన్ననలు పొంద గలిగినారు. ఆనాటి పరిచర్యలో అత్యున్నతముగా బాప్తిస్మము పొంది నేటికి అంతర్జాతీయముగా దైవ వాక్య పరిచర్యలో ఎదుగుతున్న పాస్టర్ శ్రీ విలియం బెన్‌టిక్, రెవ. శ్రీ డాక్టర్ దైవాభిమానులు ఆనాటి పరిచర్య స్మృతిలో నేటి ప్రభువు పక్షమున నిలచిన యోధులు, ఈనాడు అంతర్జాతీయముగా సువార్త సేవలో ఎదిగి పశ్చిమగోదావరి చుట్టుప్రక్కల గ్రామాలలో తిరిగి సువార్తను విస్తరించి పరిచర్య చేయుచున్న రైతుబిడ్డలు శ్రీ జీవన్‌గారు, శ్రీశాస్త్రిగారు, శ్రీ సాగర్‌గారు, శ్రీ సుదర్శనంగార్లు ఒకనాటి సండేస్కూలు చిన్నారులుగా ఉండి నేడు ప్రభు సువార్త పొలములో ఎదిగిన కుసుమాలు. ఇంక ఎంతోమంది ప్రభుసేవలో వాడబడినారు. వారి పేర్లు మరచి వ్రాయలేకపోతున్నందుకు నన్ను క్షమించగోరు చున్నాను. ఆనాటి దినములలో జాయింట్ కలెక్టర్‌గా వున్న శ్రీ లాల్‌రోసమ్‌గారు మాకు అందించిన ప్రోత్సాహము యెనలేనిది. 1983లో మేము సువార్త సేవలో నిమగ్నమైన రోజులలో అద్భుతముగా ఊహించలేని రీతిలో ఆంస్టర్‌డామ్ నుండి బిల్లీగ్రహంగారి కూటములకు ఆహ్వానము వచ్చింది. ఆహ్వానమునకు సంఘము ఎంతో సంతోషించి నన్ను ప్రోత్సహించి సహకారము అందించింది. ఈ ఏర్పాట్లు అన్నీ శ్రీ పి.పి.విలియమ్స్‌గారు చేశారు. అది నాకు ఎంతో ఆధ్యాత్మిక అనుభవమై ఎన్నో ఆత్మీయ సత్యాలను నేర్చు కున్నాను. ఈ నా ఆధ్యాత్మిక అనుభవాన్ని నా ఆత్మీయ ఎదుగుదలకు మాత్రమే వాడుకున్నాను. అది క్వయర్‌లోను, స్త్రీల సమాజములోను పరిచర్య చేయుటకు నాకు ఎంతో చేదోడు వాదోడుగా నిలిచింది. నంద్యాల పొల సమాజ ములో మమ్ములను మలచి తొలచిన ప్రభువైన యేసుక్రీస్తు అనుభవముతో పాటు ఈ పరిచర్య ఒక ఆధ్యాత్మిక అనుభూతిని మిగిల్చింది. తరువాత 1984 ఏప్రిల్ నెలలో నెల్లూరు పట్టణములోని రెండవ తెలుగు బాప్టిస్టు సంఘము డౌనీహాలులో కాపరిగా పనిచేయుటకు ఆహ్వానించినారు. ఆనాటి డౌనిహాలు సెక్రటరీగా వున్న శ్రీ పి. కృపాచారిగారు మా నిర్ణయము తెలుపమని టెలిగ్రామ్ పంపుతూ మా పెద్దక్కగారైన శ్రీ గంట రాజమ్మగారిని మమ్ములను తీసుకొని రమ్మని మా వద్దకు పంపినారు. మేము బహుగా ప్రార్థించి, దైవచిత్తమని, మా అక్కగారి మాట, మా తండ్రిగారి కోరిక మేరకు వచ్చుటకు సమ్మతి తెలిపినాము. వెనువెంటనే మేము నెల్లూరు రాకుండా మూడు నెలలు ఏలూరు సంఘములో వుండి కాపరిలేని సంఘముగా వదలక క్రొత్త కాపరిని నియమించు వరకు నిలిచి తరువాత 1984 జూలై 1న నెల్లూరు రెండవ బాప్టిస్టు చర్చి డౌనీహాలు పాస్టర్‌గా చేరినాను.

(సశేషం)

ధారావాహిక

# నిత్యజీవజలము

8

ప్రతివ్యక్తి బైబిల్ ప్రకారం జీవించటం, బైబిల్ చదువుతూ ఆధ్యాత్మిక విలువలు నేర్చుకుంటూ, మన మనస్సులను పవిత్రంగా, మనస్సాక్షిని నిష్కళంకంగా ఉంచుకొనుటకు నేర్చుకొనవలసిన అవసరత ఈ అంత్య దినాలలో ఎంతైనా ఉంది.

అవును, బైబిల్ పాఠములు, ప్రసంగములు, క్రైస్తవ మాసపత్రికలు, సాక్ష్యములు మరియు ఇతర ఆధ్యాత్మిక ప్రచురణలు చదువుట ద్వారా కొంతలో కొంతయినా ఆత్మీయ మేలులు పొందుతాము అనే విషయం ఒప్పుకుంటాను. అయితే అనుదిన పఠనము కొరకు చిన్న చిన్న పుస్తకాలు అచ్చువేయ బడుచున్నవి. వివిధ క్రైస్తవ ప్రచురణలలో ప్రకటన ద్వారా వాటి సంఖ్య కూడా వృద్ధి చెందుతుంది. ఇవి మంచివే కాని మన ఆధ్యాత్మిక ఎదుగుదలకు బైబిలు అన్నింటికన్నా వాడియైన ఎటువంటి ఖడ్గముకంటె పదునైనది. ఆ పరిశుద్ధ గ్రంథమును వ్యక్తిగతంగా చదివితే, ప్రార్థనతో చదువుట ప్రారంభిస్తే, ప్రభువా నీ వాక్యముతో నాతో మాట్లాడయ్యా అని వినయంగా ప్రార్థిస్తే ఆ మెల్లనైన మధురమైన ఆయన స్వరం ఎంతో ఎంతెంతో ఆత్మీయ మేలులను ఇస్తుంది. ఆయన పలికే ప్రతి మాట జీవాన్ని, వెలుగుని జీవితానికి ఇస్తుంది. ఇది ప్రతి వ్యక్తికి అవసరమైన, వ్యక్తిగతమైన స్పర్శ, ఇది మన రాతి హృదయాల్ని స్పందించే బలమైన దేవుని స్పర్శ.

బైబిల్ ధ్యానం దైనందిక జీవితంలో ఒక భాగముగా ఉండాలి. ధ్యానమే కాదు వాటిని అనుసరించి నడుచుకోవాలి. జార్జిముల్లర్‌గారు పేరు ఇప్పటికీ మన క్రైస్తవులలో వినని వారుండరు. ఆయన "విశ్వాసము"నకు మారు పేరు అని నేనంటుంటాను. ఆయన ఇంగ్లాండు దేశములో బ్రిస్టల్ అనే పట్టణంలో ప్రార్థన, విశ్వాసపు పునాదుల మీద తన అనాథ శరణాలయమును నడిపించాడు. ఆయన తన 69వ యేట ఏమన్నాడంటే "పదిమందికి ఉపయోగపడే ఈ మంచిపనిలో నేను సంతోషంగా ఉన్నానంటే దానికి ఒకే ఒక కారణం – నేను పరిశుద్ధ గ్రంథమును ప్రేమించడమే. ప్రార్థనా పూరిత మనస్సుతో ఈ బైబిలును అంతా సంవత్సరానికి నాలుగుసార్లు చదవడం నా అలవాటు. చదివి దానిని నా హృదయానికి అన్వయించుకొని నా జీవితంలో అనుసరిస్తున్నాను. ఈ అరవై తొమ్మిది సంవత్సరాలుగా నేను సంతోషంగా ఉన్నాను" అన్నాడు.

బైబిలు చదివి అర్థం చేసుకోవడం కష్టమే. కొన్ని భాగాలకు సందర్భం తెలిసి వుండాలి. వ్రాసిన కాలము తెలిసి యుండాలి. అలాంటి తెలియని సందర్భాలలో బైబిల్ టీచర్స్‌ను, సంఘకాపరిని, తల్లిదండ్రులని అడిగి తెలుసుకోవడం మంచిది. మీకు జ్ఞాపకం ఉందా? అపొస్తలుల కార్యములు 8:25 నుండి ఇథియోపీయుల రాణియైన కందాకే, మంత్రి యైన నపుంసకుడు యెరూషలేము నుండి తన రథము మీద తిరిగి వెళ్తూ యెషయా గ్రంథము చదువుతుంటాడు. అప్పుడు ఆత్మచే ప్రేరేపింబడిన ఫిలిప్పు అతనిని చేరి "నీవు చదువు చున్నది గ్రహించుచున్నావా?" అని అడిగినప్పుడు "ఎవడైనను త్రోవ చూపకుంటే నేనేలాగు గ్రహింపగలను" అన్నప్పుడు ఫిలిప్పు రథమెక్కి దారిలో ఆ మంత్రికి, అతని ప్రశ్నలకు విపులంగా సమాధానం చెపుతూ కృపను గూర్చి ప్రకటించెను. ఇలా వాక్యమును విపులీకరించడం ద్వారా ఆ మంత్రికి రక్షణ సంతోషము కలిగెను (అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మ మిచ్చెను. మంత్రి సంతోషించుచు తన త్రోవను వెళ్ళెను. అపొ.కార్య. 8:39). కాబట్టి మనమిక్కడ తెలుసుకొనిన విషయం ఏమంటే వాక్యాన్ని అర్థం చేసుకొనుచూ చదవాలి. దానికి అవసరమైన నిఘంటువులు, ఆత్మీయమైన వ్యాఖ్యాన ములు లాంటివి ప్రతి గృహములో ఉండటం అవసరం. పెద్ద పెద్ద భవనాలు కట్టుకుంటాం. అందులో ప్రార్థనా గది ఉందా? దినపత్రిక, వారపత్రిక, పక్షపత్రిక, మాసపత్రికలకు చందా దారులుగా ఉంటాం. గృహమును అలంకరించటానికి ఎంతో వ్యయం చేస్తాం కాని కుటుంబంలో రెఫరెన్సు బైబిల్, బైబిల్ నిఘంటువు ఉన్నాయా? మనలను మనమే పరీక్షించుకుందాం.

రక్తమాంసములతో ఉన్న మన శరీరమునకు బేధికమైన ఆహారం ఎంత అవసరమో మన ఆధ్యాత్మిక జీవితానికి వాక్యము అంతే అవసరం. ఆహారం తీసుకోవడానికి కొన్ని ఇష్టాలు, అలవాట్లు, సమయా సమయాలు ఉంటాయి. అలాగే ఈ నూతన సృష్టియైన ఆత్మీయ జీవిత ఎదుగులకు కూడా

ఒక ప్రత్యేక పద్ధతిలో, క్రమము తప్పక ఒక మోతాదు ప్రకారం తీసుకొనిన ఆధ్యాత్మిక వాక్య పఠనము ఎంతో మేలు చేస్తుంది. బైబిలు చదవడానికి ఒక క్రమము, అలవాటు ఉండాలి. అలాగే ఒక ప్రత్యేక సమయాన్ని కేటాయిస్తే మంచిది. లేకపోతే మర్చిపోతాం. మన అనుదిన జీవితంలో నిద్రలేవడం మొదలు నిద్రపోయే వరకు చాలా చర్యలు కేటాయించబడిన సమయం లోనే చేస్తాం. మరి వాక్య ధ్యానమునకు, వ్యక్తిగత వాక్య ధ్యానమునకు, కుటుంబ ప్రార్ధనలకు మనమెందుకు సమ యాన్ని కేటాయించలేకపోతున్నాం. ఎందుకు ఈ విషయానికి ప్రాధాన్యత ఇవ్వలేకపోతున్నాం! ప్రయత్నిద్దాం! ఉదయాన్నే పనులను పురమాయించుకోడానికి ముందయితే చాలా మంచిది. యేసుక్రీస్తు వారు పెందలకడనే, ఇంకను చీకటిగా ఉండగనే తండ్రి సన్నిధిలోనికి వెళ్ళే వారని మీకు జ్ఞాపకం ఉండవచ్చు. సరే బైబిలు ధ్యానమునకు ఉదయమే లేదా సాయంత్రమో అన్ని పనులు ముగిసిన తర్వాతనో లేదా రోజు మధ్యలో ఎప్పుడైనా సరే ఏ సమయంలో ధ్యానించుచున్నావో అనేది ప్రశ్న కాదు ఇక్కడ, అసలు బైబిల్ ధ్యానమునకు ప్రత్యేక సమయం ఉందా? దానిని క్రమంగా వాక్య ధ్యానము, తద్వారా ఆయన చిత్తానుసారమైన నడవడికకు వాడుకుంటున్నామా అనే స్వీయ పరిశీలన కావాలి.

మొదటిగా బైబిల్‌లోని 66 పుస్తకములలో ఉన్న మూల కధలను విపులంగా తెలుసుకుంటే మంచిది. బైబిల్ పుస్తకము లను, పుస్తకములలోని మూల వచనములను కంఠస్తం చేస్తే కూడా మంచిదే. ఇష్టమైన వాక్యాలను, అధ్యాయాలను వీలైనంత వరకు మరీ మరీ చదువుతూ ఉంటే దేవుడు తప్పక మాట్లాడుతాడు. వీలైనంత వరకు మీ అంతట మీరే ఒక ప్రణాళిక వేసుకొని, ఆదికాండము మొదలు ప్రకటన వరకు చదవడానికి ప్రయత్నం చేయండి. ఇంకా వీలైతే మీకు ఇష్టమైన బైబిలు వ్యక్తులను, స్థలాలను, సందర్భాలను, వచనాలను, పేరాగ్రాఫ్‌లను అధ్యాయనం చేయడం మంచిది. వ్యక్తిగతంగా ఏకాంతంలో ధ్యానం చేయడం ఎంత అవసరమో, ఒక గ్రూపుగా కూడా బైబిలును ధ్యానం చేయడం ఆత్మీయ జీవితానికి అంతే మేలు చేకూరుతుంది.

చాలామంది ఇప్పటి యౌవనస్తులే కాక పది పన్నెండు సంవత్సరాల వయసు పిల్లలు కూడా చందమామ, బుజ్జాయి ప్రభలు, పత్రికలు పెద్ద పెద్ద నవలను మొదటి పేజి నుండి చివరి పేజి వరకు చదివందే కూర్చున్న స్థలం నుండి పైకి లేవరు. ఇక వేసవి సెలవులు వచ్చాయంటే వారికి అదే పని. ఇలాంటి వారు చాలామంది నాకు తెలుసు. ఆంధ్రప్రభ, పత్రికలలో సీరియల్ కొరకు తదుపరి కాపీ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తుంటారు. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే బైబిల్ చదివేటప్పుడు ఎక్కడో ఒక పేజీ తెరచి అందులో ఏవో కొన్ని వరుసలు చదివి బైబిలు మూసివేసే వారు మన క్రైస్తవులలో అనేకులు ఉన్నారు. అలాకాకుండా ఒక్కో పుస్తకం పూర్తిగా అధ్యాయనం చేస్తే బాగుంటుంది.

బైబిలులోని ప్రతి పుస్తకములో పరిశుద్ధాత్మ దేవుడు గ్రంధకర్తకు ఒక విషయం బోధించి వ్రాయించి ఉంటాడు. వీలైనంత వరకు ఆ పుస్తకంలోని పుటలను మొదటి నుండి చివరి వరకు అధ్యాయనం చేస్తే గ్రంధకర్త ఉద్దేశ్యం పరిశుద్ధా త్ముని పని మన జీవితంలో సఫలం అవుతుంది. అలాగే బైబిల్లో ఆదికాండం మొదటి అధ్యాయం మొదటి వచనం నుండి ప్రకటన ఆఖరి అధ్యాయం ఆఖరి వచనం వరకు అధ్యాయనం చేయడంలో ఎంతైనా ఆశీర్వాదం ఉంది అంటే అతిశయోక్తి కాదు. ప్రయత్నించండి.

దేవుని రక్షణ ప్రణాళిక బైబిల్ మొదటి పుట నుండి ఆఖరి పుట వరకు భద్రపరచబడి వుంది. కనుక బైబిలును ఒకే ఒక పుస్తకంగా భావించి పూర్తి చేయడంలో ఆశీర్వాదం ఉందని మరోసారి చెప్పవచ్చును. అందుకే ఆది క్రైస్తవ సంఘకాపరులు 66 పుస్తకములలోని ఆది క్రొత్తనిబంధనలు అని కూడా అనడం పరిపాటే. పుస్తకంగా చదివినా, 66 పుస్తకాలను ఒకే పుస్తకంగా భావించి అధ్యాయనం చేసినా ఒక ప్రణాళిక తీసుకొని అధ్యాయనం చేస్తే మంచిది. చాలామంది మౌనంగా గదిలో కూర్చుని ప్రతి వరుసని పదేపదే చదివి అర్ధం చేసుకుంటూ ఉంటారు. మరికొందరు పెదవి విప్పి గొంతు తెరచి చదువుతుంటే అర్ధమవుతుంది. ఆనందంగా ఉంటుంది అంటారు. చాలా కుటుంబాలలో కుటుంబ ప్రార్ధనలలో బైబిలు మొదటి నుండి చివరి వరకు అధ్యాయనం చేసే అలవాటుంది. అది చాలా మంచిది. ఇలా ప్రార్ధనలో కూర్చున్నప్పుడు ఒక్కొక్కరు ఒకటి రెండు వచనాలు చదివి ఆ దిన పాఠమును ముగిస్తుంటారు.

(సశేషం)

# శాశ్వత రక్షణ

## (రక్షణ యొక్క శాశ్వత భద్రత)

హెబ్రీ గ్రంథం చదివి అర్ధం చేసుకునే ముందు, ఈ హెబ్రీ పత్రిక క్రీస్తు యేసు యొక్క ప్రధాన యాజకత్వం గురించి రాబోవు యుగంలో (వెయ్యేండ్ల పరిపాలనలో) దేవుని యొక్క ఉద్దేశ్యమును నెరవేర్చుటకు వ్రాయబడినదని గ్రహించవలెను. వెయ్యేండ్ల పరిపాలన అంటే నిత్యజీవము కాదు, నిత్యజీవానికి ఆది, అంతము లేదు. ఈ లోక సంబంధమైన జీవితమును గూర్చి అయినను, నిత్యజీవమును గురించి అయినను కాక క్రీస్తు యొక్క వెయ్యేండ్ల పరిపాలనలోని జీవన విధానాన్ని తెలియజేస్తుంది. (హెబ్రీ. 2:5) మనం పైన చెప్పిన విధంగా వాక్యముతో వాక్యమును సరిచూసుకొనుట చేతనే మనం దేవుని వాక్యమును గ్రహించగలము. హెబ్రీ పత్రిక 6వ అధ్యాయం అనేకులను నిరుత్సాహపరచే రీతిగాను, అసలు ఏ మానవుడు రక్షణలో కొనసాగలేడు అనే విధంగా కనబడు తుంది. అయితే అది సరికాదు. ఈ భాగము ఇశ్రాయేలీయుల ఐగుప్తు చెర నుండి విముక్తి, సీనాయి అరణ్యవాసం, వాగ్దాన దేశం అయిన కానాను చేరలేకపోవడం తెలియజేయబడు తుంది. ద్వితీయోపదేశకాండం మొదటి 10 అధ్యాయాలలో ఐగుప్తు చెర నుండి కానాను దేశంలో ప్రవేశించుటకు సిద్ధం అయ్యే వరకు ఇశ్రాయేలీయులతో దేవుడు వ్యవహరించిన విధానము అర్ధం అవుతుంది. హెబ్రీ పత్రిక సరిగ్గా అర్ధం చేసుకోవడానికి దయచేసి ద్వితీయోపదేశకాండం మొదటి పది అధ్యాయాలు చదువవలసినదిగా మనవి చేస్తున్నాను. ఈ సత్య వాక్యము మనకు బోధ కలుగు నిమిత్తం వ్రాయబడినదనియు, అంతమాత్రమే కాక ఈ సంగతులు వారికి దృష్టాంతంగా సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను అని గ్రహించవలెను (రోమా 15:4, 1కొరింథి. 10:11).

ఇశ్రాయేలీయులు భయంకరమైన దాస్యములో అనగా దాసుల గృహములో బంధింపబడిన జనాంగముగా ఉన్నట్లు మనము ద్వితీ. 5:6లో చూస్తున్నాము. వారు చేయుచున్న వెట్టి పనులనుబట్టి వారు నిట్టూర్పులు విడుచుచు పెట్టిన మొఱ్ఱలను బట్టి దేవుడు వారియందు కనికరపడి వారిని విడిపించుటకు దిగి వచ్చియున్నాడని అర్ధమవుతుంది (నిర్గమ. 2:23, 3:8).

అదే విధంగా రోమా 6:17లో వ్రాయబడిన ప్రకారము ఇశ్రాయేలీయులు ఫరో అధికారము క్రింద దాసత్వములో ఉన్నట్లు మనము కూడా మరణాధికారముగల సాతాను క్రింద దాసులుగా ఉంటున్నాము. ఇశ్రాయేలీయులు తమ్మును తాము ఫరో అధికారము నుండి రక్షించుకోలేకుండా ఉన్నప్పుడు దేవుడు మోషేను పంపి విడుదల చేసిన విధంగా పాపమనే దాస్యములో విడుదల పొందలేక (మన నీతితోగాని, భక్తితో గాని, బలులతోగాని మనల్ని మనం రక్షించుకోలేక) మన అతిక్రమముల ద్వారా మనం చచ్చినవారమై (ఎఫెసీ. 2:1) యుండగా, దేవుడు తన అపారమైన ప్రేమలో విశేష కనికరము చొప్పున (ఎఫెసీ. 2:4) క్రీస్తుతో కూడా మనలను బ్రతికించెను. అంతమాత్రమే కాక ఎందరు తన కుమారుని అంగీకరించు దురో వారు నశింపక నిత్యజీవము పొందునట్లుగా ఏర్పాటు చేసెను (యోహా. 3:16). తన ప్రజలైన ఇశ్రాయేలీయులను బానిసత్వం నుంచి విడిపించుటకు దేవుడు ఐగుప్తీయుల దేవతలకు తీర్పు తీర్చవలసి వచ్చింది (నిర్గ. 12:12). నిజం చెప్పాలంటే ఐగుప్తు విగ్రహములు దయ్యములే కాని దేవుళ్ళు కారు. ఉదా: దానియేలు 10:13-20 చదివితే వీటిని గురించి మనకు తెలుస్తుంది.

అదేవిధంగా మన పాప దాసత్వ విడుదల కొరకు మరణాధికారముగల ఈ లోకాధికారియైన సాతానుడు తీర్పు తీర్చబడవలసియున్నది (యోహాను 16:10, హెబ్రీ. 2:14,15, కొలస్సీ. 1:13).

దేవుడు పరిశుద్ధుడు, నీతిమంతుడు, ఆడినమాట తప్పని వాడు. పాపము వలన వచ్చు జీతము మరణము (రోమా 6:23). అయితే ఈ మరణము నుండి తప్పించబడుటకు విమోచన క్రయధనంగా ఇంకొకరు చట్టపరంగా బలిచేయ బడాలి. ఈ బలి చేయబడునది మచ్చ, డాగు లేనిదిగా వుండాలి. కనుక మరణ దాసత్వంలో ఉన్న ఇశ్రాయేలీయులు విడిపించ బడుటకు దేవుడే ఒక గొర్రెపిల్లను బలిచేసి, దాని రక్తమును ద్వారబంధముల మీద ప్రోక్షించుమని, మాంసమును కాల్చి

తినుమని సెలవిచ్చాడు. కనుక గొర్రెపిల్ల రక్తము ద్వారా ఇశ్రాయేలీయులు దాసత్వము నుండి విడిపించబడ్డారు.

కాబట్టి పాతనిబంధనలో యేసుక్రీస్తుకు సాదృశ్యమైన బలులు జరిగినవి. కనుకనే యేసుప్రభువు "లేఖనములే నన్ను గూర్చి సాక్ష్యము చెప్పుచున్నవని" యోహాను 5:39లో చెప్పాడు.

మచ్చ, డాగులేని పస్కా బలిపశువు యొక్క రక్తము ఇశ్రాయేలీయులను మరణము నుండి తప్పించి ఐగుప్తు దాసత్వము నుండి విడుదల పొందుటకు ఏ విధముగా ద్వార బంధముల మీద ప్రోక్షింపబడినదో అదే విధంగా పాపములేని (యోహాను 8:46, లూకా 23:14,15, 23:41,47). యేసుక్రీస్తు యొక్క పవిత్ర రక్తము లోకపాపముల నిమిత్తము సిలువ మ్రాను మీద కార్చబడినది.

ఇప్పుడు మరలా మనము ఇశ్రాయేలు విమోచన కార్యమును గమనించినట్లయితే ఇశ్రాయేలును దేవుడు విమోచించుట ద్వారా వారిని తన ప్రజలుగా సంపాదించు కున్నాడు (నిర్గమ. 15:13,16). అదే విధంగా క్రీస్తు కూడా పాపపు దాసత్వములో వున్న మనలను ఆయన రక్తము వలన విమోచించి తన సొత్తయిన ప్రజలుగా సంపాదించుకున్నాడు (ఎఫెసీ. 1:7, 1కొరింథి. 6:20).

ఐగుప్తులో ఇశ్రాయేలీయుల పాప దాస్య విమోచనార్థమై జరిగించబడిన పస్కా బలి మరలా చేయబడలేదు. ప్రతి సంవత్సరము జరిగే పస్కా బలి పండుగ మొదట జరిగించిన దాని జ్ఞాపకార్థమే కాని, ఎవరునూ విమోచింపబడుటకు కాదు. వాటి వలన ఎవరునూ విమోచించబడరు.

అదే విధంగా దేవుని గొర్రెపిల్లయైన మన యేసుక్రీస్తు తన స్వరక్తముతో మానవాళి శాశ్వత విమోచన కొరకు ఒకేసారి పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను (హెబ్రీ. 9:12). మనము బల్లారాధన జరిగించునప్పుడెల్లా ఆయన మరణమును జ్ఞాపకము చేసికొనుచున్నాము (లూకా 22:19,20). అయితే సిలువ కార్యక్రమము మరలా జరుగవలసిన పని లేదు.

"ఈయన అయితే పాపముల నిమిత్తమై సదాకాలము నిలుచు ఒక్క బలిని అర్పించి" అనగా పాపముల నిమిత్తమై ఎన్నటెన్నటికి నిలిచే బలిని చేశాడు. కాబట్టి ఇక మరలా బలి అవసరము లేదు. పైగా ఒక్కసారి ప్రభువు సిలువలో పలికిన జయనాదము గమనించండి.

సమాప్తమైనది!

సమాప్తమైనది ఏమిటి? ఆయన దేని నిమిత్తము ఈ లోకమునకు వచ్చెనో, ఆ పని... అదేమిటంటే మానవాళి పాపములకు ప్రాయశ్చిత్తము; పాప దాసత్వము నుండి విమోచన, నిత్యజీవప్రాప్తి అను కార్యక్రమములు పూర్తి అయినవి.

"పాపముల నిమిత్తము సదాకాలము నిలుచు ఒక్క బలిని అర్పించి దేవుని కుడి పార్శ్వమున ఆసీనుడైనాడు'

ఎప్పటికీ నీతిమంతులుగా కాలేని మనలను ఒక్క బలితోనే నీతిమంతులుగా తీర్చినాడు. అందుకే ఆ ప్రేమ నుండి మనలను ఎవరూ వేరు చేయలేరు (రోమా 8:39).

ఆ తరువాత దృశ్యమేమంటే ఇశ్రాయేలీయులు ఎఱ్ఱ సముద్రము దాటుట. ఇది కూడా వారు చేయలేని కార్యమే. ఐగుప్తు దాసత్వము నుండి గొఱ్ఱెపిల్ల రక్తముచేత విమోచించ బడినను వారు దేవునితో నడువలేకపోయారు. వారు ఐగుప్తు నుండి శారీరకముగా వేరుపరచబడినవారు ఆత్మీయంగా కూడా వేరుపరచబడాలి. వారందరు మేఘము క్రిందనుండిరి, సముద్రములో నడచిపోయిరి. మేఘములోను, సముద్రము లోను, బాప్తిస్మము పొందిరి (1కొరింథి. 10:2). ఈ సముద్ర బాప్తిస్మము, మన నీటి బాప్తిస్మము క్రీస్తు మరణములోనికి బాప్తిస్మము పొందిన దానికి నిదర్శనము (రోమా 6:3). మేఘము యొక్క నడిపింపు మనలను నడిపించే పరిశుద్ధాత్మకు గుర్తు (రోమా 8:14). ఇశ్రాయేలీయులను ఆ విధంగా మేఘము నడిపించినది (నిర్గమ. 13:21). మరియు 1కొరింథి 12:13లో వ్రాయబడినట్లు మనమందరము ఒక్క ఆత్మచేతనే నడిపించబడుచున్నాము. మోషే కూడా ఈ సందర్భములో క్రీస్తునకు సాదృశ్యముగా నున్నాడు. ఎందుకంటే మోషే "నావంటి యొక ప్రవక్తను దేవుడు మీలో నుండి పుట్టించును. మీరు ఆయన మాట వినవలెనని పలికెను" (ద్వితీ. 18:16, అపొ.కార్య. 3:22). ఇశ్రాయేలీయులు మోషేను అరణ్యములో వెంబడించినట్లు మనము కూడా యేసుని ఈ లోకమనే అరణ్యములో వెంబడించాలి. ఇశ్రాయేలీయుల అవసరములు ఏ విధంగా దేవుడు ఆనాడు తీర్చాడో, ఈనాడు మన అవసర ములు కూడా తీర్చగలనని దేవుడు వాగ్దానం చేశాడు (ఫిలిప్పీ 4:19, మత్తయి 6:32).

# మహా యజ్ఞమ్



## యేసుక్రీస్తు యుగపురుషుడు

యేసుక్రీస్తు జననానంతరం, కాలగణనం మార్పు చెందింది. అంటే క్రీస్తుపూర్వం, క్రీస్తు శకము, ఆంగ్లంలో బి.సి., ఎ.డి. అంటారని అందరికీ తెలిసిన విషయం. క్రీస్తు యుగపురుషుడుగా ఉద్భవించాడు గనుకనే, క్రీస్తు యుగం జరుగుతుంది క్రీస్తు శకం పేరుతో కాలచక్రంలో రోజులు, వారాలు, మాసాలు, సంవత్సరాలు ఒక్కటేమిటి? కాలమాన మంతా సకల విశ్వాంతరంలో క్రీస్తు శకానికి చెందినదే. క్రీస్తు జన్మించకుండా క్రీస్తుశకం ఉనికిలోకి వచ్చి ఉంటుందా? వచ్చి ఉండదు. కొనసాగుతున్న క్రీస్తు శకాన్ని ఆపుచేయగల భూతల మానవులు, దైవాలు ఎవరైనా ఉన్నారా? అనంత కోటి అశ్వాంచిత రవితేజోవిరాజిత క్రీస్తు శక కాల శకటాన్ని భూనివాసులెవ్వరూ ఆపు చేయలేరు. ఇక మరో శకం అవతరిస్తుందనే ప్రసక్తే లేదు. క్రీస్తు దైవాంశుడు, క్రీస్తు మానవావతారుడు, క్రీస్తు సత్యశీలుడు, క్రీస్తు ప్రేమ మూర్తి, నమ్మిన వారికి రక్షణకర్త, క్రీస్తు నిత్యుడు, క్రీస్తు శకం నిత్యమైనది. త్రియేక దేవుని కుమారాంశుడే శ్రీ యేసు క్రీస్తు. సకల సృష్టికర్త, సర్వేశ్వరుడు. సృష్టికర్తను విస్మరించి సృష్టిని పూజించటం తప్పు.

'అందం తమః ప్రవిశంతియే, అసంభూతి ముపాసతే తతో భూయ ఇవతేతమోయ ఉసంభ్యూత్యాగింతాః' –(ఋగ్వేద, యజర్వేదాల్లో 40:8,9).

'సర్వశ్వరుని విస్మరించి, ఆయన సృజనాన్ని ఆరాధిం చడం కారు చీకట్లో పయనించినట్లే. అది ఘోరనరకానికి చేర్చుతుంది' అని భావం. యేసుక్రీస్తు వెలుగై ఉన్నాడు. ఆ వెలుగును ఆశ్రయించిన వారి చీకటి పారిపోతుంది.

"అంతఃస్థం మాం పరిత్యజ్య బహిష్టం యస్తు సేవతే హస్తస్థం పిండముత్సృజ్యలి హేత్కుర్పరమాత్మనః" అంటే హృదయంలో నివసించు నన్ను తలపోయక, బాహ్య నిర్మిత మైన మూర్తులను సేవించువారు, తమ చేతిలోని అన్నపు ముద్దను వదలి, మోచేతిని నాకేవారౌతారు" (ధర్మనోపనిషత్ 4:58). అందుకే జ్ఞానసంపన్నుడైన మనిషి తన జీవితాన్ని సత్యమైన సర్వేశుని అనుసరించు, ఆత్మజ్ఞానార్జనయందే నిమజ్జుడు కావాలి. ఆధ్యాత్మిక జ్ఞానమే సమస్త జ్ఞానములకు మించినది.

"తత్రాపరా, ఋగ్వేదోయజుర్వేదః సామవేదో, అధర్వ ణవేదః శిక్షాకల్పో వ్యాకరణం నిరుక్తసి ఛందో జ్యోతిష్యమితి, అధరాయ, యాత ధక్షర మధిగమ్యతే".

అనగా : చతుర్వేదాలు, శిక్షాకల్పము, వ్యాకరణము వేదపద జ్ఞానము, ఛందస్సు, జ్యోతిష్యవేదాంగములు, మొదలైన వాని గూర్చిన జ్ఞానం రెండవ తరగతికి చెందిన విద్యయే. కానీ, మరణపర్యంతము, మానవుడు ఏ విద్యవలన, మోక్షము పొందగలడో, ఆ జ్ఞానార్జనం పొంది, ఆధ్యాత్మిక పథంలో పయనించునో, ఆ విద్యయే అతిశ్రేష్ఠమైన ప్రథమస్థాయి విద్యయై యున్నది' అని భావము (ముండకోప నిషత్తు 1:5).

నిజదేవుని గూర్చిన జ్ఞానము పొందడానికి పరమ పవిత్రమైన బైబిల్ గ్రంథం ఒక్కటే మూలాధారమైయున్నది. శ్రద్ధాభక్తులతో బైబిల్ గ్రంథ పఠనం చేసిన వారికి, దివ్యజ్ఞాన సంప్రాప్తం తథ్యం. ప్రయత్నించి చూడగలరు.

ప్రియ స్నేహితులారా! మనల్ని అనవరతము, మరణం వెంటాడుతూనే వుంది. అందరికీ అది సహజమైనదే. మరణం మనలను ఆవహించక ముందే, ఆ నిజదైవాన్ని కనుగొని ఆరాధించి ఆశీస్సులు పొందితే అమరలోకం ప్రాప్తిస్తుంది. ఎంత ఘోర పాపియైననూ పశ్చాత్తాపంతో ప్రభువైన యేసుక్రీస్తును రక్షకునిగా అంగీకరించి ఆయనను ఆశ్రయించినచో, మిక్కిలి కరుణతో తనయొద్దకు చేర్చుకొని పాపప్రక్షాళనం చేస్తాడు. రక్షిస్తాడేగాని శిక్షించడు. పాప క్షమాపణ పొందకుండా పరమండలంలో చేరడం దుస్సాధ్యం. మనఃపూర్వకముగా, మన్నింపు వేడుకున్న వారిని ఉచితంగా అత్యంత ప్రేమతో మన్నించి, రక్షించే యేసుక్రీస్తు దీవెనను పొందడానికి ఆయనను ఆరాధించడానికి వెనుకాడటం సముచితమా? సిలువమ్రానుపై మహాయజ్ఞ నైవేద్యమైన యేసుక్రీస్తు మహా శాంతమూర్తి. క్షమాస్వభావ సంపన్నుడు,

ఆయనను చిత్రహింసల పాలుచేస్తున్న వారందరిని కూర్చి 'తండ్రీ! వీరేమి చేయుచున్నారో వీరెరుగరు కనుక వీరిని క్షమించు' మని వారి నిమిత్తమై దైవాన్ని వేడుకున్నాడు. ఆయనకు ఇరువైపుల సిలువల్లో వ్రేలాడుతున్న ఇరువురు చోరుల్లో ఒకడు తన తప్పును తెలుసుకొని క్షమాభిక్షకోసం యేసును వేడుకున్నాడు. ఆ క్షణంలోనే అతనిని క్షమించి రక్షణ భాగ్యాన్నిచ్చి పరలోకంలో ప్రవేశం అనుగ్రహించాడు. ఈ క్షమాగుణాన్ని గూర్చి వ్యాసమహర్షి మాటలు చూద్దాం.

"క్షమాతేజస్వినాం తేజః
క్షమా బ్రహ్మ తపస్వినామ్
క్షమా సత్యం, సత్యవ్రతాం
క్షమా యజ్ఞః క్షమాశమః'

క్షమా, అంటే సహించడం, క్షమించడం. ఇది మనుష్యులలో తేజస్సును కలిగిస్తుంది. తపస్సంపన్నుల బ్రహ్మసాక్షాత్కా రానికి తోడ్పడుతుంది. సత్యాన్ని పాలించేవారికి సాధు స్వభావాన్ని అలవరుస్తుంది. క్షమాగుణం గొప్ప యజ్ఞముతో సమానం. ఇది మనిషికి మనోనిగ్రహాన్ని, ఆత్మశక్తిని నిర్మల మనస్సును కలిగిస్తుందని భావం. మనం యేసుప్రభువు నుండి క్షమాగుణం నేర్చుకోవాలి. ఆయనపై పగబట్టిన వారు యేసును సిలువలో చిత్రహింసలు పెడుతుంటే వారిపై పగతీర్చుకోకుండా వారిని క్షమించుమని దేవుణ్ణి వేడు కున్నాడు. తెలియక చేసినా, తెలిసి చేసినా పశ్చాత్తాపంతో క్షమాపణనర్ధించే అపరాధులను క్షమించే మహత్తర క్షమాగుణం యేసుప్రభువుకు మాత్రమే సొంతం. ఆయన నుండి మనం పుణికి పుచ్చుకోవచ్చు. క్షమారాహిత్యము మనిషికి హాని చేస్తుంది. శరీరాన్ని బలహీన పరుస్తుంది. క్షమాగుణం సాధువులకు వీరులకు విశేషమైన ఆభూషణం, క్షమించడం వీరుల కర్తవ్యం. మహాత్ములు క్షమాగుణం కలిగి వుంటారు. క్షమాగుణం సమాజాన్ని ప్రభావితం చేస్తుంది. సత్పురుషులు క్షమాగుణంతో ఎందరినైనా ఉద్ధరిస్తారు. మనిషిలో క్షమాగుణం లేకపోతే ఘనకార్యాలను సాధించ లేడు. సత్ఫలితాలను పొందలేడు. జీవితంలో పరాజయం లేకుండా ఉండాలంటే క్షమాగుణాన్ని కలిగి ఉండాలి. ఇది కుటుంబానికి, సమాజానికి, దేశానికి కూడా చాలా అవసరం, శ్రేయస్కరం.

**సంక్షిప్తంగా సజీవయాగ సమభావం**

యాగమ విధుల్ని ఏర్పరచింది సృష్టికర్త. ప్రపంచ గర్భం యాగమ విధి అన్నారు. ఆదియందు ప్రజాపతి వలన సృజింపబడిన కోర్కెలను యజ్ఞాలు ఇస్తున్నాయి. పాపక్షమ, శాశ్వత బ్రహ్మం, యజ్ఞం వలన పొందవచ్చు! అని వ్రాయ బడింది ఏల? బ్రహ్మయజనం ఒక్కటిగా ఉంటుంది. బ్రహ్మ యజనం అంటే బ్రహ్మ మధ్యాహారంగా ఉంటుంది అని గ్రహించాలి. ఆ బ్రహ్మయజనం దైవ అప్రీతికరం. ఇది ఋగ్వేద రుక్కు.

యజ్ఞం లేకుండా, ప్రార్థనతో పాపక్షమాపణ అసాధ్యం. ఆర్యులు పురుషమేధం, గోమేధం, అశ్వమేధం, అజామేధం, రాజసూయం, వాజపేయం, నరమేధం మొదలైన యజ్ఞాలను ఆచరించేవారు. పాపపరిహారం అన్వేషించారు.

సత్యవేదం బైబిల్ గ్రంథంలో పాత, క్రొత్త నిబంధన లున్నాయి. సమాధానార్థ బలి, దహనబలి, ప్రాయశ్చిత్తార్థ బలి అని పాత నిబంధన కాలంలో, ఆవులను, మేకలను, గొఱ్ఱెలను, పొట్టేళ్ళను యూదులు అర్పించేవారు. ఆర్యులు అర్పించే ఆయా బలులు ప్రజాపతి, యజ్ఞానికి సాదృశ్యా లైనట్లే, యూదులర్పించే వివిధ బలులు యేసుక్రీస్తు చేసిన మహాయజ్ఞం (సిలువధారణం) నకు ఛాయా చిత్రములై యున్నవి. ప్రజాపతి ఆత్మలను రక్షించుటకై తనను తానే యజ్ఞపశువుగా అర్పించుకొన్నాడని ఋషుల సాక్ష్యం. సకల మానవులను రక్షించుటకే, లోక పాపములను మోసికొని పోవు యేసుక్రీస్తు (దేవుని గొఱెపిల్ల) సిలువలో బలియాయెనని బైబిలు గ్రంథం వక్కాణిస్తుంది.

ధర్మ, గృహ్య, శ్రౌత అనే త్రిసూత్రాలు మానవోన్నతికి ఆర్యులు పాటించిన మార్గదర్శకాలు. ధర్మం అంటే మతం, గృహ్యం అంటే సంస్కారం, శ్రౌతం అంటే వేదానుకూలం. అంశతి సంస్కారాలు జీవాత్మ పవిత్రతకై ఏర్పడ్డాయి. అవి నలువది. ప్రస్తుతం పంచమహాయజ్ఞాలు మాత్రమే ఆచరింపదగినవిగా ఉంటాయి. యజ్ఞానికి మేధమని, యాగమని పర్యాయ పదాలున్నాయి. యజ్ఞాస కర్మకు ఆగమ విధి అని మరొక పేరుంది. ఈ యజ్ఞాసకర్మం ఆర్యులకు ప్రాముఖ్యమైంది. ఆర్యుల మతం, జీవనం సర్వం దీనిపైనే ఆధారపడి ఉండేవి.

# నా దృష్టిలో మా నాన్న దేవుని ప్రతినిధి

**(శ్రీమతి కమలమ్మ, పులివెందుల)**

ప్రియమైన హన్నాకృప పాఠకులకు యేసుక్రీస్తు నామమున వందనములు. నేను స్వర్గీయ శ్రీ వై.యస్. వెంకటరెడ్డిగారి చివరి సంతానము. మా అమ్మనాన్నలకు ఐదుగురు మగ సంతానము, ఐదుగురు ఆడ సంతానము. వారు పెద్ద కొండారెడ్డి, చిన్న కొండారెడ్డి, ప్రభుదాసురెడ్డి, రాజారెడ్డి, పురుషోత్తమరెడ్డి మరియు సుగుణమ్మ, రత్నమ్మ, రాజమ్మ, మేరి మరియు కమలమ్మ (అనగా నేను). బహుశా నేను పుట్టే సమయానికి మా నాన్నకు 60 సంవత్సరాలు మా అమ్మకు 48 సంవత్సరాలు ఉండవచ్చు. యౌవనస్తుడుగా ఉన్నప్పుడు ఎలా ఉన్నాడో నాకు తెలియదు. నేను పుట్టే లోపల ఇద్దరి అన్నలకు పెళ్ళి అయి, ఒక అన్నకు ముగ్గురు, ఇంకొక అన్నకు ఇద్దరు పిల్లలున్నారు. మాది ఒక పెద్ద ఉమ్మడి కుటుంబం. నేను జన్మించక మునుపే మా అమ్మ, నాన్న ఇంకా మిగతా కుటుంబ సభ్యులు యేసుప్రభువును తమ స్వంత రక్షకునిగా అంగీకరించి యున్నారు. నేను పులివెందులకు 12 కిలోమీటర్ల దూరంలో వున్న బలపనూరులో జన్మించాను. అక్కడ ఐదవ తరగతి కంటే ఎక్కువ అవకాశము లేదు.

మా పెద్దక్క శ్రీమతి సుగుణ పీటర్స్ 5వ తరగతి చదివి, ఇంటి పనులు చేసుకుంటూ ఉండగా ఆమెకు 13 సంవత్సరా లకే పెళ్ళి చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఆ సమయంలో మా రెండవ అక్క రత్నమ్మ 3వ తరగతి చదివేటప్పుడు ఒక మిషనరీ మా ఊరుకు వచ్చి మా అమ్మ నాన్నల అతిథ్యం పొందినప్పుడు మా రత్నక్క చాలా హుషారుగా ఉండుట గమనించి, బోర్డింగు స్కూల్లో చదువుకుంటావా? అని ఆ మిషనరీ అడిగినప్పుడు మా రత్నక్క వెంటనే తన సమ్మతిని తెలిపినందున ఆమె చూపించిన జమ్మలమడుగు బోర్డింగు స్కూల్లో చేర్పించుట జరిగింది. అప్పుడు మా పెద్దక్క (సుగుణక్క), 'నేను కూడా ఇంకా చదువుకుంటాను, ఇప్పుడే పెళ్ళి చేసుకోను' అని తిండి తిప్పలు మాని కూర్చున్నప్పుడు మా నాన్నగారు ఆమెను కూడా జమ్మలమడుగు బోర్డింగు స్కూలుకు పంపించటం జరిగింది. 5వ తరగతితో చదువు నిలిపి వేసిన అక్క మద్రాసులో, గుంటూరులో చదివి బి.ఎ. డిగ్రీ చేసి అందులో ఆంధ్రా యూనివర్సిటీలో ఫస్టుర్యాంకు సంపాదించి గోల్డు మెడలిస్టుగా ఘనత సాధించి కడప పట్టణానికే స్త్రీలలో ప్రథమ గ్రాడ్యుయేట్‌గా వెలిగిపోయింది. ఆమె ఉన్నత స్థితికి చేరుకోవడానికి మా నాన్నే కారణం. ఆయన పిల్లల అభిరుచులకు విలువనిచ్చి, ప్రోత్సహించి బిడ్డలందరిని అత్యున్నతమైన స్థానాలలో నిలువబెట్ట గలిగినారు. పెద్దక్క టీచరుగా, హెడ్‌మిస్ట్రెస్‌గా పనిచేసి రిటైర్మెంట్ సమయానికి జిల్లా విధ్యాశాధికారిగా ఉన్నారు. ఇప్పుడామె వయసు 90 సంవత్సరాలు. మంచి ఆరోగ్యంతో కడపలో ఉంటున్నారు.

మా రెండవ అక్క డాక్టరు రత్నమ్మ రత్నరాజ్. మా నాన్న ప్రోత్సాహంతో ఆమె వెల్లూరు మెడికల్ కాలేజిలో యం.బి. బి.యస్ చదివి, ఇంగ్లాండు దేశానికి రెండుసార్లు వెళ్ళి యం.యం.యస్.ఎ. పోస్టు గ్రాడ్యుయేషన్ డిగ్రీ తెచ్చుకొని, జమ్మలమడుగు క్యాంబెల్ హాస్పిటల్లో 35 సంవత్సరాలు పనిచేసి జిల్లాలోనే మంచి డాక్టర్‌గా పేరు తెచ్చుకున్నారు.

మా మూడవ అక్క రాజమ్మ దేవిడ్. ఆ కాలములో నర్సింగ్‌లో గ్రాడ్యుయేషన్ (బి.యస్.సి నర్సింగ్) సి.యం.సి వెల్లూరునందు చేసి ఎంతోమందికి మంచి పరిచర్యలు చేశారు.

మా నాల్గవ అక్క డాక్టరు మేరీ పునీతం. ఆమె యం.బి.బి.యస్., డి.జి.ఓ. చేసి ఆస్ట్రేలియాలో అలిస్ప్రింగ్ మిషన్ హాస్పిటల్లో మంచి డాక్టరుగా చాలాకాలం సేవ చేశారు. మా నాన్న ఆడపిల్లలమైన మమ్ములను చదివించడానికి ఎన్నడూ వెనుకాడలేదు. మా ఆసక్తి కొలది ఎంత చదవాలను కుంటే అంత చదివించారు. మాకు స్కాలర్‌షిప్ లాంటివి ఏవీ లేవు. తనే కష్టపడి చెమటోడ్చి మమ్మల్ని చదివించాడు. ఆ కృతజ్ఞతతో ఆయన పేరుతో ఆడపిల్లలకు ప్రత్యేకంగా ఒక జూనియర్ కళాశాల స్థాపించినారు. ఆ కాలేజిలో నేను 12 సంవత్సరాలు ప్రిన్సిపాల్‌గా పనిచేసి 70 సంవత్సరాల వయస్సులో (13-08-2008) ఆ కళాశాలను గవర్న మెంటుకు స్వాధీనం చేసి నేను ప్రక్కకు తప్పుకున్నాను. ఆయన పిల్లలమైన మేము శాయశక్తుల కష్టపడి పనిచేసి కష్టార్జితం

తింటున్నాము.

మా అమ్మ నాన్న వృద్ధులుగా ఉన్నప్పుడు మా యింటికి ఒక బిక్షగాడు వచ్చాడు. మా అమ్మ 'ఇంత కాలం వేసినన్నాళ్ళు వేశాము. ఇప్పుడు నా కాలు కుంటుపడింది' అన్నప్పుడు మా నాన్న 'మీ అమ్మ వేసే పరిస్థితిలో లేకుంటే నీవు వేయవచ్చు కదా! ఎందుకు తప్పించుకుంటావని' నన్ను నిలదీశాడు. అవసరములో నున్న వారికి సహాయము చేయడానికి ఎప్పుడూ ముందుండేవాడు.

బెన్ని అనే ఒక ముసలామె ప్రతిరోజూ భిక్షానికి మా ఇంటికి వచ్చేది. మా అమ్మ ఆమెకు బిక్షము వేసేది. ఒకరోజు మా నాన్నతో 'ఈ బెన్నిని అన్ని ఇళ్ళు తిరగకుండా మనింటికే రమ్మను, చనిపోయే వరకు ఈమెను ఆదుకోలేమా' అని మా అమ్మ అన్నప్పుడు మా నాన్న చాలా సంతోషంగా 'నీకింత మంచి బుద్ధిపుడితే నేను కాదంటానా?' అన్నాడు. అప్పటి నుండి ఆమె మరణము వరకు ఆమె బాగోగులు మా అమ్మవాళ్ళే చూసుకున్నారు.

మా నాన్న ఆంధ్రక్రైస్తవ కీర్తనలు చాలా చక్కగా రాగయుక్తంగా గట్టిగా పాడేవాడు. చర్చిలో ప్రసంగించాల్సి వచ్చినప్పుడు ఆ ప్రసంగము మధ్యలో కొన్ని పాటలను సందర్భానుసారంగా పాడి వినిపించేవాడు. కొన్ని పాటలను ఎక్కువసార్లు పాడేవారు. వాటిలో ముఖ్యమైనవి, ఇష్టమైనవి వ్రాస్తున్నాను. 'సకలేంద్రియములారా', 'ఉన్నపాటున', 'నీ పాదసన్నిధి', 'అన్నికాలంబుల', 'త్రాహిమాం', 'ఎటిగి ఎటిగి', 'దేవుడిచ్చిన దివ్యవాక్యం', 'దేవా సహాయంబునిమ్ము', 'నన్ను గన్నయ్యరావే', 'నాయన్న రాగదే', 'నీ చరణములే', 'పైనమై యున్నానయ్యా', 'పోపోవేయో లోకమా', 'యెహోవ నా మొరలాలించెను', 'యెహోవా మా తండ్రికాడా', 'యేసు నామంబెత్తి', 'వందనంబొనర్తుమో ప్రభో', 'వద్దు మనసా', 'వినరేయో నరులారా' మొదలగు పాటలను ఎంతో అర్ధ యుక్తంగా, ఉత్సాహంగా, గొంతు విప్పి పాడేవాడు. రాగం తప్పు పాడితే ఒప్పుకొనేవాడు కాదు.

సర్వసాధారణమైన, శుభ్రమైన వస్త్రములను వేసుకునే వాడు. డాబుగా ఎప్పుడూ కనబడలేదు. అలాగు నడచుకొన లేదు. చర్చికి ఎప్పుడూ సమయం లోపలే వెళ్ళేవాడు. ఇంట్లో అందరిని అదే ప్రకారంగా చెయ్యాలని కోరేవాడు. మా అమ్మకు ఇంటి పనియందు కూడా సహాయ పడేవాడు.

జమ్మలమడుగు మిషను హాస్పిటల్లో కొన్ని కాంట్రాక్టు పనులు చేయించి, దానిలో వచ్చిన లాభాన్ని అక్కడే పిల్లల వార్డు కట్టుటకు వాడినాడు. స్మిత్ మిస్సమ్మ దానిని తెరిచే టప్పుడు మా నాన్నను సత్కరించాలని చూశారు. అటువంటిది ఏదైనా జరిగితే నేనసలు ఆ ఫంక్షనుకు రాను అని గట్టిగా చెప్పాడు. తనను ఎవరు హెచ్చించాల్సిన పని లేదని దేవుడు గుర్తిస్తే చాలని అనేవాడు (2కొరింథి.10:18). జమ్మల మడుగును ఆనుకొని ఉన్న పెన్నానదిపైన ఒక బ్రిడ్జి కట్టారు. 60 సంవత్సరాలు ఆ బ్రిడ్జి పాడవకుండా వాడబడినది. గుత్తిలో ప్రస్తుతం నడిపే డిగ్రీ కళాశాల బిల్డింగు కూడా ఆయన కట్టిందే. నేటికీ ఆయన పనితనానికి నిదర్శనంగా నిలిచి వుంది.

చివరి సంతానం నేను. నన్ను మద్రాసులో చదివించారు. నేను 8వ తరగతి చదివేటప్పుడు టైఫాయిడ్ జ్వరం వచ్చి కళ్యాణి హాస్పిటల్లో ఉన్నప్పుడు మా అమ్మనాన్న మద్రాసుకు వచ్చి హాస్పిటల్లో నన్ను చూసుకున్నారు. నా అనారోగ్యమును బట్టి నన్ను మద్రాసుకు తిరిగి పంపకుండా జమ్మలమడుగులో మా రెండవ అక్క దగ్గరపెట్టి చదివించారు. యస్.యస్. యల్.సి. పాసైన తర్వాత మా మూడవ అక్క కాకినాడలో ఉండగా ఆమె దగ్గర ఇంటర్మీడియట్ చదివించినారు. ఎ.సి.కాలేజి గుంటూరులో బి.ఎ. ఇంగ్లీషు లిటరేచర్ ఒక సంవత్సరం ముగించి వేసవి సెలవులకు ఇంటికి వచ్చినప్పుడు మా చివరి అన్న డాక్టరు పురుషోత్తమరెడ్డిగారి పెళ్ళి ప్రయత్నంలో ఉన్నారు. మా నాన్న ఆస్తమా జబ్బుతో విపరీతమైన బాధ అనుభవిస్తున్నారు. ఆయన ఇక ఎక్కువకాలం ఈ లోకంలో ఉండను అనే తలంపు కలిగినప్పుడు పిల్లలందరిలో చిన్నదాన్న యిన నన్ను చూచినప్పుడు తన బాధ్యత గుర్తు చేసుకొని నాకు పెళ్ళి చేస్తే తనకు ఈ లోక సంబంధమైన బాధ్యతలు తీరిపోతాయని తలంచి పది రోజుల వ్యవధిలోనే నా పెళ్ళి కూడా పురుషోత్తమన్న పెండ్లితో పాటు జరిపించారు. పెళ్ళిలో తండ్రిగా నా చేతిని నా భర్త చేతిలో పెడుతున్నప్పుడు చేతులు చాలా వేడిగా వుండి వణకుతూ ఉన్నాయి. నేను పెళ్ళి నుండి యింటికి చేరేలోగా మా నాన్నను దేవుడు తీసుకుంటాడేమో అని అనుకున్నాను. కాని నా పెళ్ళి తర్వాత ఎనిమిదన్నర

(...మిగతా 26వ పేజీలో)

# మదర్ తెరీసా

మదర్ తెరీసా శిశుభవన్ పిల్లల్ని దత్తతకివ్వడం ద్వారా వారు కుటుంబ పోషణలో జీవించే అవకాశం ఉంటుందని ప్రోత్సాహించేవారం. భారతదేశంలోనేకాక ఇతర దేశల వారు కూడా శిశుభవన్ పిల్లల్ని దత్తత తీసుకోడానికి వచ్చేవారు. విదేశాలకు పిల్లలను దత్తత ఇచ్చే విషయం విమర్శలకు గురవుతూనే ఉంది. పిల్లల్ని అమ్ముకోవడమనేది ప్రపంచ వ్యాప్తంగా "పిల్లల వ్యాపారం" అని వార్తలు వెలువడుతూనే ఉంటాయి. కొన్నిసార్లు ఆ వార్తల్లో అతిశయోక్తులు లేవని తేలుతుంది. ప్రపంచవ్యాప్తంగా సంపన్నులు అందమైన పిల్లల్ని కొనుక్కోడానికి ఎంతైనా చెల్లిస్తారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పిల్లల్ని అపహరించుకుపోయే సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. దానివల్ల విదేశీ దత్తతలు మందగించడం జరుగుతుంది లేదా దత్తత విధానాన్ని పునఃపరిశీలించడమూ అవసరమవుతుంది. పత్రికా వార్తల వల్ల మదర్ తెరీసా దత్తత ఇవ్వడం ఆపుచేసిన సందర్భాలు ఉన్నాయి. ఆర్థికంగా వెనుకబడిన తృతీయ ప్రపంచం నుండి పిల్లల్ని యూరపు దేశములో దత్తతకోసం పంపించి ఆ పిల్లల్ని వైద్య పరిశోధనలకు వాడుకుంటున్నారని ఒక పత్రికలో సంచలనాత్మక కధనం ప్రకటించబడింది. ఆ పత్రిక ప్రకటన చూసి మదర్ తెరీసా మనఃస్థాపానికి గురై వెంటనే ఢిల్లీ వెళ్ళి ఆ దేశ అంబాసిడర్‌ను కలిసి తన ఆందోళనను వివరించింది. ఆ కధనం దారుణమనీ అప్రతిష్టాకరమనీ ఆ పత్రిక సంపాదకుని లేఖ వ్రాశారు. ఆ పత్రిక క్షమాపణ చెప్పింది.

దేవుని దయవలన మరియు ఆమె చిత్తశుద్ధి మనం ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరగకుండా ఎక్కడో దిక్కులేని చావుకు గురి కావలసినవారో లేక అనాధలుగా బ్రతకవలసిన బిడ్డలు తమ జీవితాలలో మేలైన బ్రతుకులు జీవించడానికి మదర్ తెరీసా ద్వారా ప్రణాళిక చేయబడినట్లు చూడగలము. స్విట్జర్లాండులో జోమిల్లర్‌గారు 'దీపావళి దత్తత సేవా సంఘం' స్థాపించారు. ఈ సంస్థవారు బిడ్డలను దత్తతకు తీసుకునే కుటుంబాలను క్షుణ్ణంగా పరిశీలించి వారి వివరాలను మదర్ తెరీసా సిస్టర్స్‌కు సమర్పించేవారు. మదర్ తెరీసా సిస్టర్స్ దత్తతకు ఇవ్వబడే బిడ్డల యొక్క వివరాలను, వారికున్న శారీరక, మానసిక లోపాలు ఏమైనా ఉంటే వాటిని, వారిని ఏలాటి వాతావరణంలో పెంచితే బాగుంటుంది అనే అంశాలను వారికి తెలియజేసేవారు. ఈ విధంగా దత్తతకు సంబంధించి ఆ కుటుంబ పరిస్థితులు, దత్తకు వెళ్ళబోయే బిడ్డ విషయాలు సరి చూసుకుని సరియైన అవగాహనతో నిర్ణయం తీసుకునే వారు. దత్తతకు వెళ్ళబోయే బిడ్డ అంగీకారాన్ని తీసుకొని ఆ ఫోటోను ఆ కుటుంబానికి చూపేవారు. అన్ని లాంఛనాలు పూర్తి చేసుకుని దత్తత చేసుకున్న బిడ్డతో వారి దేశానికి వెళ్ళేవారు. ఇలా దత్తత కివ్వబడిన బిడ్డలు కొంత కాలానికి పెరిగి పెద్దవారై ప్రయోజకులైన తరువాత మిషనరీస్ ఆఫ్ ఛారిటీస్‌లో వాలంటీర్లుగా పనిచేసి వెళ్తూ వుంటారు. ఎంత గొప్ప ప్రణాళిక గదా! ఫ్రాన్సు దేశములో ఒక కుటుంబం దత్తత తీసుకున్న అమ్మాయి చెత్తకుండీలో అరచేతిలో సరిపోయేంత చిన్న ఆకారముతో నెలలు తక్కువగా జన్మించిన బిడ్డగా మదర్ తెరీసా సిస్టర్స్‌కు దొరికింది. ఈ బిడ్డ ఫ్రాన్సు దేశములో పెరిగి పెద్దదై ఒక నర్సుగా శిక్షణ పొంది ఆమె శెలవులలో శిశుభవన్ వాలంటీర్‌గా చేసి తిరిగి తన దత్తత తలిదండ్రుల వద్దకు వెళ్ళేది. ఇదే బిడ్డ అబార్షన్‌కు గురై పుట్టకుండా ఉండి ఉంటే లేక మదర్ తెరీసా సిస్టర్స్ ఈమెను చెత్తకుండీ నుండి కాపాడుకుంటే, కాపాడి మంచి సంపన్న కుటుంబములో దత్తతకు పంపబడి తిరిగి తనలాగా అభాగ్యులుగా జన్మించిన వారికి సేవ చేసే అవకాశం వచ్చిందంటే ఆ బిడ్డ యెడల దేవుని ప్రణాళిక ఎంత గొప్పది గదా. అందుకే మదర్ తెరీసా ఏ బిడ్డను ఎవరు చంపకూడదని. ముఖ్యంగా అబార్షన్ చేయించి బిడ్డలను చంపడం ఎవరికీ హక్కులేదని, అంతకంటే మహాపాపం మరొకటి లేదని మదర్ బోధించేవారు.

ఫ్రెంచివారు, స్విస్‌వారు, బెల్జియంవారు, కెనడావారు ఉదారమైన వారు. వీరు తీవ్రమైన ఎముకల సమస్యలతో బాధపడే పిల్లల్ని లేదా పోలియోతో బాధపడేవారిని, మానసిక వ్యాధులున్న వాళ్ళని తీసుకుని పెంచడానికి ఇష్టపడతారు. కొన్ని కుటుంబాల వారికి కన్న సంతానమున్నాగాని పై లోపాలు ఉన్న పిల్లల్ని దత్తత చేసుకుని వారి బిడ్డలతో సమానంగా పెంచడానికి ఇష్టపడతారు. 'నా కడుపున పుట్టిన

బిడ్డ నాది అనుకోవడం అహంకారం' అని వారి అభిప్రాయం. అనాథలైన వికలాంగులకు తమ ప్రేమను పంచడం వారి అదృష్టంగా భావిస్తారు. లుసానెలోని ఒక స్విస్ కుటుంబం ఒక బిడ్డను దత్తత తీసుకుందామని అనుకున్నప్పుడు, వారికి ఇద్దరు బిడ్డలను దేవుడు అనుగ్రహించారు. అయినా జబ్బుతో ఉన్న అనాథ బిడ్డను కూడా దత్తత తీసుకుని పెంచాలని నిర్ణయించు కుని, మదర్ తెరీసా దగ్గర జోమిల్లర్ ద్వారా మూడు వారాలకోసారి రక్తమార్పిడి చేయిస్తే తప్ప ఆర్నెల్లకు మించి బతకని ఒక పిల్లవాడిని తెచ్చుకున్నారు. ఈ పిల్లవాడి కోసం ఈ కుటుంబం త్యాగాలు చేయవలసి వచ్చింది. వైద్యం చేయించ డానికి వారి జీతం సరిపోక కారు కూడా అమ్మి వేయాల్సి వచ్చింది. చూసిన వారంతా వారికి పిచ్చి పట్టిందనే వారట. కాని ఆ పిల్లవాని మీద మమకారం వారికి ఏ మాత్రం తగ్గలేదు. పరలోకంలో వారి నిధి అధికమౌతుందనే వారట.

మదర్ తెరీసా ఎంతగానో అభిమానించే పిల్లవాడు ప్రిన్స్. బల్లెన్స్టాజ్ కుటుంబము స్విట్జర్లాండ్‌లోని సియరె అనే పర్వత ప్రాంత పట్టణంలో ఉంటున్నారు. బల్లెన్స్టాజ్ అవిటి పిల్లలకు ఉపయోగించే పనిముట్లు, వస్తువులు చేయుటలో నిపుణుడు. ప్రిన్స్‌కు ఏడాదిన్నర వయసున్నప్పుడు బల్లెన్స్టాజ్ కుటుంబము అతనిని దత్తత తీసుకున్నారు. ప్రిన్స్‌కు మొండెం క్రింద భాగం, రెండు కాళ్ళు లేవు. చేతులు ముందుకు మామూలుగా ఉండాల్సింది వెనక్కి తిరిగి ఉంటాయి. ఈ బిడ్డ అందరివలె బ్రతకాలని ఈ దత్తత చేసుకున్న దంపతులు ఆకాంక్షించారు. ఆ పిల్లవాడి వర్చస్సు, ప్రశాంతత, కలుపుగోలుతనము కొట్టొచ్చినట్లు కన్పిస్తాయి. కొందరు నిపుణులు అతని మొండెం భాగాన్ని రబ్బరు పాత్రలో అమర్చిపెట్టారు. దాన్ని కృత్రిమమైన రెండు పాదాలకు బిగించారు. బ్యాటరీతో నడిచే చక్రాల బండిలో బడికి పంపేవారు. ప్రిన్స్ ఆ కుటుంబంలో ఆరో వాడు. ఆ దంపతుల కడుపున పుట్టిన వాళ్ళు ముగ్గురు. సబిత అనే రెండేళ్ళ మానసిక సమస్యలున్న అమ్మాయిని, మాయ అనే ఆరేళ్ళ పిల్లను దత్తత తీసుకున్నారు. గుర్జాన్ అనే కళ్ళు కనిపించని పిల్లవాడిని, సప్న అనే మానసిక రోగిని కూడా దత్తత చేసుకున్నారు. పదిమంది పిల్లలతో బల్లెన్స్టాజ్ ఇల్లు నిండింది. ప్రేమకుమారి అనే అమ్మాయికి చేతులు, కాళ్ళు లేవు. బల్లెన్స్టాజ్ దంపతులు ప్రేమకుమారిని కూడా తెచ్చు కోవాలని అనుకున్నారు. అప్పటికే ఆ పిల్లకి పదేళ్ళు. మామూ లుగా దత్తత తీసుకొనే వయసుకంటే చాలా ఎక్కువ. బల్లెన్స్టాజ్ భార్య ఆ పిల్లను గురించి విన్నాక తమ ఇల్లే ఆ ప్రేమకుమారి ఇల్లు కావాలని అనుకున్నారట. ఈ విధంగా బల్లెన్స్టాజ్ ఇల్లు పదకొండుమంది పిల్లలతో సంతోషానందములతో విలసిల్లే గృహంగా మారింది.

సియెరెకి దగ్గర్లో ఉంటున్న మచెడ్ దంపతులు రాణి అనే అమ్మాయిని దత్తతకు తీసుకున్నారు. రాణినేగాక మరో ఆరుగురు పిల్లల్ని పెంచుకున్నారు. మొదట్లో ఇద్దరు అబ్బాయి లను పెంచుకున్నారు. కంపూచియా యుద్ధంవల్ల అనాథలయిన వారు. తర్వాత రాజ్, సూరజ్ అనే అన్నదమ్ములను దత్తతకు తెచ్చుకున్నారు. వీళ్ళిద్దరు డార్జిలింగ్ పిల్లలు, ఇంట్లో నలుగురు మగపిల్లలున్నారు, ఆడపిల్లలు కూడా ఉంటే బాగుంటుందని ముగ్గుర్ని దత్తత తీసుకున్నారు. ఆరేళ్ళ గీత, మూడేళ్ళ బిందు, నాలుగేళ్ళ రాణి. బిందుకు చెముడు, మూగ. వీళ్ళంతా ఆదరించే కుటుంబంలో హాయిగా జీవిస్తున్నారు. రాణి కిలకిల నవ్వుతూనే ఉండేది. ఆ పిల్ల వల్ల మచెడ్ కుటుంబం మరింత సంపన్నం అయినట్లు కనిపించేదట.

ఎవరికీ అక్కర్లేని పిల్లల్ని మదర్ తెరీసా పెంచి పెద్ద చేసేవారు. దత్తత వయసు దాటని అబ్బాయిలను మిషనరీస్ బ్రదర్ ఆఫ్ చారిటీ గృహాలకు పంపేవారు. అక్కడ వారికి చదువు చెప్పించి, ఏదో వృత్తి పని నేర్పించేవారు. ఉద్యోగం దొరికేందుకు సాయం చేస్తారు. మామూలుగా ఈ పిల్లల చదువు, బాధ్యత మోసే వాళ్ళను చూసేవారు. అలా బాధ్యత మోసే వారలే వేలాదిమందికి చదువు చెప్పిస్తుండేవారు. పిల్లలు చదువునందు రాణిస్తే యూనివర్సిటీ చదువుల వరకు చదువుతుండేవారు. చదువు సంధ్య అబ్బని అమ్మాయిలకు పెళ్ళిళ్లు చేసి పంపేవారు. మదర్ తెరీసా ప్రతి వాళ్ళకి ఏదో కొంత కట్నం ఇచ్చేటంత వాస్తవికంగా ఉండేవారు. కొన్ని చీరలు, వంటపాత్రలు, కుర్చీలు, బల్లలు. కొద్దిగా డబ్బు బ్యాంక్ డిపాజిట్‌లో వాళ్ళ పేరు మీద వేసి ఉంచేవారు. వాటిని పాటించకుండా ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేయడం కష్టం. మదర్ ఆలోచనలు, పనులు ఆచరణాత్మకంగా ఉంటాయి. శిశు భవన్‌లో పెరిగిన అమ్మాయిలు చక్కగా కాపురాలు చేసుకుం టున్నారు. వాళ్ళ వాళ్ళ కుటుంబాలు వాళ్ళకు ఉన్నాయి. కలకత్తాలోనే ఉంటున్నవాళ్ళు ఎక్కువగా మదర్ హౌస్‌కు వస్తూనే ఉంటారు. ముఖ్యంగా పండగలప్పుడు మదర్ తెరీసా కూడా హాజరై ఆ కుటుంబాలను ఆశీర్వదిస్తుంటారు.

పెద్ద కథ

# విశ్వాసంలో ఓ మెట్టు

42

సావిత్రి సహకారంతో ఇంట్లో సెమినరీ చదువు నిరాటంకంగా సాగిపోతున్నది. వీధిలో వాకిలి అయినందున వీధిలో నడిచేవారందరూ రాత్రింబగళ్ళు సామ్యేలు దీక్షగా చదవటం, వ్రాయటం గమనిస్తూనే ఉన్నారు. ఎదురింట్లో గుర్రం జాషువాగారి తమ్ముని పెద్ద కుమారుడు నివసిస్తున్నాడు. ఆయన సామ్యేలు కంటే చాలా సంవత్సరాలు పెద్ద వయస్సున్న వాడు. ఒకరోజు ఉదయం బజారుకెళ్ళి వచ్చేసరికి తన కుర్చీలో ఆయన కూర్చుని సామ్యేలు వ్రాసిన నోట్సు, చదువుతున్న పుస్తకాలు అన్నీ పరిశీలనగా చూస్తున్నాడు. సామ్యేలు లోపలికి రాగానే 'సామూ, నువ్వు చాలాకాలంగా ఈ కుర్చీలో కూర్చుని రాత్రింబవళ్ళు ఏమి చేస్తున్నావో తెలిసింది కాదు, ఇప్పుడు ఇవన్నీ చూసిం తర్వాత నువ్వు డాక్టర్ సామ్యేలువి అనిపిస్తుంది. నువ్వు డాక్టరేట్ కోసం వ్రాస్తున్నావా?' అన్నాడు. 'లేదన్నా బైబిలు తెలుసుకోవాలన్న కోరిక మాత్రమే' అన్నాడు సామ్యేలు.

నెలలు గడచిపోతున్నాయి. నెలకొకసారి కోర్టులో వున్న యాక్సిడెంటు కేసు కొరకు కోర్టుకు హాజరు కావలసి వస్తుంది. కోర్టు వాయిదాకి హాజరుకావాలంటే ఒక రోజంతా సమయం వృధా అవుతుంది. కనుక కోర్టుకు హాజరయ్యేటప్పుడు బైబిలులో పుస్తకాల వరుస క్రమం, అధ్యాయాల క్రమం ఇంకా అదే విధంగా అనేక విషయాలు కాగితం మీద వ్రాసుకొని కోర్టువారు లోపలికి పిలిచే వరకు వాటిని కంఠత పెడుతుండేవాడు.

కోర్టులో ప్రతి వాయిదాకి ఒక వ్యక్తిని సాక్షిగా పిలిచి ప్రశ్నించేవారు. కాని ఒక్కసారైనా సామ్యేలును ఏ ప్రశ్న అడుగలేదు. సామ్యేలు పేరు పిలువగానే లోనికి వెళ్ళి బోనులో నిలబడి జడ్జి వైపు చూసి ఆయన తలకుపైగా ఆసీనుడైయున్న విశ్వ న్యాయాధిపతికి  దండం పెట్టి చేతులు కట్టుకొని నిలుచుండేవాడు. ఆ జడ్జికి న్యాయాధిపతి అయిన దేవుడు కోర్టులో ఉన్నాడని సామ్యేలు నమ్మేవాడు.  అంతేకాదు ప్రపంచంలో మానవాళి నడుమ న్యాయం తీర్చే దేవుని కళ్ళు ఎప్పుడూ గమనిస్తాయని నమ్మాడు. సామ్యేలు తన జీవితంలో దేనికోసం పోరాడకుండా  మౌనంగా  ఉండగలగటానికి కారణం బైబిలులో దేవునివ్వబడిన బిరుదులన్నిటిలో ఆయన న్యాయాధిపతి అని, భూమియందంతట ఆయన తీర్పులు నెరవేర్చబడుతుంటాయి అని, అన్యాయం అనేది తాత్కాలికంగా కనబడుతుందే కాని నెరవేర్పులో దేవుని న్యాయ విమర్శలో ఎవరూ తప్పించుకోలేరు. రాజైనా, కూలీ అయినా దేవునికి పక్షపాతము లేదు అని హృదయపూర్వకంగా నమ్ముతాడు సామ్యేలు.

1992 ఆగష్టులో కలకత్తా నుండి ఒక చర్చీ వారు అక్టోబరు 12 నుండి 17 వరకు జరిగే అంతర్జాతీయ సువార్తికుడు యూదుడైన అమెరికన్ మారిస్‌సెరిల్లో మీటింగు లకు హాజరవవలసినగా ఆహ్వానం పంపించారు. 1972 నుండి అతని పత్రికలు సామ్యేలుకు అందుతున్నవి.  ఆయన భారతదేశంలో ఎక్కడ మీటింగ్స్ పెట్టినా సామ్యేలుకు ఆహ్వానం అందుతుండేది. కాని ఎన్నడూ వెళ్ళలేదు. ఈసారి కూడా అంతే అనుకున్నాడు. కాని ఏదో మాటల సందర్భంలో సామ్యేలు తమ్ముడు సంఘకాపరియైన జోసఫ్ నేను రాను పోను చార్జీలు ఇస్తాను నువ్వు ఆ సభలకు హాజరవమని డబ్బులు ఇచ్చాడు. అక్టోబరు 10 రాత్రి మెయిల్లో బెర్తు రిజర్వేషన్ చేయించుకున్నాడు. అక్టోబరు 10వ తారీఖున తమ్ముడు జోసఫ్ మ్యారేజ్ డే. ఆ రాత్రి ఆ ప్రార్థన కూటములో పాల్గొని ఆ రాత్రే హౌరా మెయిల్లో కలకత్తా బయలుదేరాడు సామ్యేలు.

దక్షిణ భారతదేశానికి ఉత్తర భారతదేశానికి ఏ విషయం లోనైనా పోలికలు, మంచిమర్యాదలు మనకు కనబడవు. ఒకసారి ఉత్తర భారతదేశంలో ప్రవేశించిన వారికి దక్షిణ భారతదేశంలో నివశించే మనం ఎంత అదృష్టవంతులమో అర్థం అవుతుంది. ఉత్తర భారదేశంలో ప్రవేశించిన రైలులో రిజర్వేషన్ పాటించరు. దొంగల భయం,  రౌడీల భయం ఎక్కువ. అలానే మెయిల్ బండి ఉత్తర భారతదేశం ఒరిస్సాలో ప్రవేశించగానే రిజర్వేషన్ కంపార్టుమెంటు నిండా జనం. మరలా రెండవ రాత్రి గడచిపోయి కలకత్తా ఇంకా మూడు గంటల ప్రయాణం ఉందనగా రైలు ఖాళీ అవుతుంది. ఉదయం ఏడు గంటలకు పెట్టెలో నుండి పెద్ద బైబిలు తీసి చదవసాగాడు సామ్యేలు.

ఒక యౌవనస్తుడు పొడవుగా, ముప్పై సంవత్సరాల యువకుడు ఇంత లావున విప్పారిన ముఖంతో 'సార్' అని అరిచినట్లు పిలిచి ప్రక్కన కూర్చుని 'మీరు కూడా మీటింగు లకేనా?' అని అడిగాడు. తర్వాత వారు తెనాలిలో ఇదే కంపార్టుమెంటులో ప్రవేశించారని ఆయనతో మరి ఒక మాస్టారు కూడా వస్తున్నారని చెప్పాడు. ఆయన పేరు చేబ్రోలు సాల్మన్‌రాజు. తర్లుపాడులో లూథరన్ హైస్కూల్లో లెక్కల మాస్టారు. ఆయనతో వస్తున్న మాస్టారు బండి ప్రభుదాసుగారు తెలుగు మాస్టారు.

సామ్యేలు 1965లో తన తండ్రి పని మీద కలకత్తా వెళ్ళి పది రోజులు ఉన్నాడు. అందువల్ల కలకత్తా కొంచెం పరిచయం వుంది. ముగ్గురూ కలసి మీటింగులు పెట్టే ఆ పెద్ద చర్చీ వద్దకు వెళ్ళారు. అప్పటి నుండి కష్టాలు ప్రారంభం.

బండి ప్రభుదాసుగారు, సాల్మన్‌రాజుగారు రిజిస్ట్రేషన్ కోసం పంపించిన మనీ ఆర్డరులో ఒకరిది మాత్రమే వారికి అందింది అంటారు. మళ్ళీ 150 రూపాయలు కట్టాలంటారు. వసతి లేదు. రాత్రి ముప్పై కిలోమీటర్లు ప్రయాణంచేసి స్టేడియంలో పండుకోవాలి. కదిలితే మెదిలితే పైసలు కట్టమంటారు.

ఈ మీటింగుల కొరకు తాత్కాలిక చర్చివంటిది ఐదు లక్షలతో కట్టారు అయిదు రోజులకు మాత్రమే. మొదటిరోజు ప్రసంగం వినిన తర్వాత సామ్యేలు ముందు కూర్చున్న కొత్త స్నేహితులు మాట్లాడుకుంటున్నారు ఆయన ప్రసంగం ఏమీ గొప్పగా లేదని. అనవసరంగా ఇంత డబ్బు ఖర్చు చేసుకొని వచ్చామని మాట్లాడుకుంటున్నారు. సామ్యేలు వారి దగ్గరకు వెళ్ళి 'వచ్చిన వారు ఎలాగూ వచ్చారు కదా, భోజనానికి వసతికి డబ్బులు కట్టారు కనుక ఈ అయిదు రోజులు కలకత్తా పట్టణమంతా తిరిగి చూడండి' అని సలహా ఇచ్చాడు. కాని వారు చాలా నమ్మకంగా అయిదు రోజులు అన్ని మీటింగుల్లో పాల్గొన్నారు. సామ్యేలు మాత్రం ప్రతిరోజు ఉదయం బయలుదేరి సాయంకాలం వరకు కలకత్తా పట్టణాన్ని సర్వే చేశాడు.

ఆఖరి రోజు స్వస్థతా కూడిక ఎక్కడో ఒక పెద్ద మైదానంలో ఏర్పాటు చేశారు. సామ్యేలు ఆ మహాసభకు వెళ్ళాలని సాయంకాలం నాలుగు గంటలకు చర్చి దగ్గరకు వచ్చాడు. అప్పటికే అందరూ ఆ మహాసభ గ్రౌండ్‌కి వెళ్ళి పోయారని తెలిసింది. అక్కడికి ఎలా వెళ్ళాలని అడుగుతుంటే అక్కడ నిలిచియున్న రెండు లారీలను చూపించి, ఆ లారీలు అక్కడికి వెళ్తున్నాయి అందులో వెళ్ళండి అన్నారు.

ఆ లారీ డ్రైవర్ 'మీరు లారీ బాడిలో కూర్చుని అయిదు మైళ్ళదూరంలో ఉన్న ఆ సభా ప్రాంతానికి మనం చేరే లోపల లారీలో ఉన్న మరో నలుగురితో కలసి పనిచెయ్యాలి' అన్నాడు. సరేనని లారీ పైకి వెళితే, ఆ రెండు లారీల నిండా ఆ సాయంత్రం జరగబోయే మీటింగ్ విషయం ఒక ప్రక్క, మారిస్ సెరుల్లా పెద్ద ఫోటో మరొక ప్రక్క, ఇప్పుడు ప్రారంభమైన స్వస్థతా సభకు సంబంధించిన వివరాలు కలిగిన పెద్ద పెద్ద కరపత్రాలు ఉన్నాయి. ఈ అయిదు మైళ్ళు లారీలు ప్రయాణించి సభాస్థలికి మేము చేరే లోపల మా ఇష్టం వచ్చినట్లుగా ఆ కరపత్రాల కట్టలను రోడ్డు మీద పడెయ్యాలి. వాటి ఖరీదు రెండు లక్షలు. పది రోజుల ముందు పంచాల్సిన కరపత్రికలు అవి. మీటింగు స్థలం వద్దకు వచ్చేటప్పటికి ఖాళీ అయినవి. రాజుల సొమ్ము రాళ్ళపాలు. దేవుని సొమ్ము?

మీటింగ్ జరిగేటప్పుడు ముఖ్య ప్రసంగీకుడు ఇప్పుడు అద్భుతాలు జరుగుతాయి దయచేసి పోలీసు వారు జోక్యం చేసుకోవద్దు అని అయిదు నిమిషాలకు ఒకసారి అరచి చెప్తున్నాడు. మొదటగా చెవిటివారి కొరకు ప్రార్థన. స్వస్థత పొందిన వారిని మా వాలంటీర్లు స్టేజీ మీదకు తీసుకొని వస్తారు అన్నాడు. అయితే ఇప్పుడు క్రైస్తవ్యాన్ని ఎదుర్కొంటున్న వారు –పైకి మీ వాలంటీర్లు లేకుండా వచ్చి వారే సాక్ష్యం చెప్పాలి అన్నారు. కొంచెంసేపట్లోనే పెద్ద గొడవ. మారిస్ సెరుల్లాను పోలీసులు భద్రతా వలయంగా ఏర్పడి ఆయన్ని అక్కడ నుండి తీసుకొని వెళ్ళి ఆ రోజే దేశం నుండి పంపిం చేశారు. ఈ సంఘటన ఆయనకు చాలా మేలు చేసింది. విదేశాలలో ఆయన గొప్ప క్రైస్తవ హీరోగా పేపర్లు వ్రాశాయి. తద్వారా చాలామంది ఆయనకు దాతృత్వం చూపారు. అయితే దాదాపు లక్షమందికి పైగా హాజరైన స్వస్థతా కూడిక రసాభసా కావడంతో యేసు స్వస్థత పరుస్తాడని నమ్మి వచ్చిన వేలాది మంది కుంటివారు, గ్రుడ్డివారు, రోగులు ఎంత యాతనపడి వచ్చారో అంతకు మించిన బాధతో, వేదనతో గుంపులు గుంపులుగా వెళ్ళి పోవడం సామ్యేలు హృదయాన్ని కలచి వేసింది.

క్విజ్

# మార్చి నెల ప్రశ్న? 52

పాఠకులను వాక్యపు జ్ఞానంలో పెంచటమే ఈ శీర్షిక ఉద్దేశ్యం.

**1. ప్రవక్తయైన ఏలియా 1రాజులు 19వ అధ్యాయం 10 నుండి 14 వచనములలో చెప్పినది ఆయన తెలిసి చెప్పెనా తెలియక చెప్పెనా?**

**2. ఇశ్రాయేలీయులకు రాజుగా ఉన్నవాడు చేయ కూడని పనులు సొలొమోను చేసి తన సంతతికి రాజ్యము రాకుండా చేసినాడు. ఆ నిషేదించబడిన పనులు ఏవి?**

**(రెండవ సమూయేలు గ్రంథము నుండి)**

**జవాబులు వ్రాసిన వారు :**

**శ్రీమతి బత్తుల ఆనీమేరి, హైదరాబాదు**

**శ్రీమతి సంపూర్ణ సాల్మన్‌రాజు, నర్సరావుపేట**

**కుమారి తాతపూడి ప్రవీణ, చెన్నై**

**ఫిబ్రవరి నెల ప్రశ్నలకు జవాబులు :**

**జవాబు:**

1. బత్షెబ తండ్రి ఏలీయాము కూడా ఆ 30 మంది శ్రేష్ఠులైన అధిపతులలో ఒకడు (2సమూ. 11:3, 23:34)
2. 2సమూ. 15:18లో దావీదు రాజునకు ముందుగా నడుచు వారు గాతు నుండి వచ్చిన గిత్తీయులు. వారు 600 మంది.

**చందా పంపదలచిన వారు :**
మా యొక్క బ్యాంక్ (S.B.I.) ఆన్‌లైన్ అకౌంట్ ద్వారా పంపవచ్చును.

నెం. **1095729436 2**

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఒంగోలు
కె. సామ్యేల్ రాజేంద్ర

**ఆన్‌లైన్‌లో డబ్బులు పంపిన వారు వెంటనే 9866716506కు ఫోన్ ద్వారా మీ పేరు తెలియజేయండి**

## ఈ నెల పోషకులు :

| | | |
|---|---|---|
| బిషప్ రెవ.డా॥యం.ఎస్.శాంతవర్ధన్ | గుంటూరు | 1000 |
| డా॥ పి. హుస్సేనయ్య | బెస్తవారిపేట | 1000 |
| రెవ.డా॥ కె. శాంసన్ | హైదరాబాద్ | 1000 |
| శ్రీమతి నిర్మల శాంతవర్ధన్ | గుంటూరు | 500 |
| శ్రీమతి ఆనీస్మైల్స్ ప్రభాకర్ | హైదరాబాద్ | 500 |
| అపో. ఎబినెజరు | హైదరాబాద్ | 500 |
| శ్రీ నరసింగరావు | నరసంపేట | 300 |
| శ్రీ వెంకటరంగం | ఒంగోలు | 300 |
| శ్రీ నీలకంఠ | నెల్లూరు | 300 |
| శ్రీమతి కూచిపూడి సౌభాగ్యం | ఒంగోలు | 200 |
| శ్రీ జె. ఆనందం | ఒంగోలు | 200 |
| శ్రీమతి సంధ్యా చంద్రబాబు | పిడుగురాళ్ళ | 200 |
| శ్రీ ఆర్. రాజవర్ధన్ | చీరాల | 200 |
| శ్రీ సొలొమోన్ రాజు | నరసారావుపేట | 200 |
| శ్రీ రాపూరు | పులివెందుల | 200 |
| డా॥సి. హెచ్. నిరీక్షణ | ఒంగోలు | 200 |
| శ్రీ ఆర్. సుగుణభూషణం | చీరాల | 200 |
| శ్రీమతి శశికళ జోషి | విజయవాడ | 200 |
| శ్రీమతి యునిసిప్, యం.పి.టి.సి. | రాపూరు | 200 |

# ఇది పరిశుద్ధాత్మయేనా లేక కర్ణపిశాచా? 3

**(బైబిలు ఉపదేశిని - బైబిల్ కౌన్సిలింగ్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా)**

**6. తండ్రి, కుమార పరిశుద్ధాత్మ అయిన మన దేవుడు ఇప్పుడు సిలువ చెంత సాతానును ఓడిస్తున్నాడు.**

సిలువకు వెళ్తూ యేసు, " ఇప్పుడు లోకమునకు తీర్పు జరుగుచున్నది, ఇప్పుడు ఈ లోకాధికారి బయటకు త్రోసి వేయబడును"" అని చెప్పాడు (యోహాను 12:31).

వేల సంవత్సరాల తర్వాత, వేలాది జంతువుల రక్తాన్ని పాప పరిహారార్ధబలిగా అర్పించిన తరువాత, యేసు పరిపూర్ణుడు, నిందారహితుడైన దేవుని గొర్రెపిల్లగా వచ్చాడు. యేసును రెండవ ఆదామని సరిగానే అన్నారు. యేసు పరిపూర్ణుడు, పాపరహితుడునైన దేవుని గొర్రెపిల్లగా మన పాప పరిహారార్ధబలిగా సిలువపై మొదటిగా వధించబడ్డాడు. యేసు, సాతానును జయిస్తానని చెప్పిన వాగ్దానం, సమాధి ఆయనను పట్టి ఉంచలేకపోయినప్పుడు నెరవేరింది. దేవుని ఉగ్రత నుండి మనల్ని రక్షించడానికి సిద్ధంగా, ఆయన మధ్యవర్తిగా, యేసు సింహాసనంపై దేవుని కుడి పార్శ్వాన ఆసీనుడై సజీవుడై యున్నాడు.

**ఇప్పుడు పరిశుద్ధాత్మ - రక్షణ తాను యేర్పరచుకొన్న వారి మధ్య కృపతో సంచరిస్తున్నాడు. అలా దేవుడు వారిని సాతాను శక్తి నుండి తిరిగి తీసుకుంటున్నాడు**

రక్షణ మరో పదం నీతిగా తీర్చబడుట - యేసు రక్తం మన పాపాల్ని కప్పి వేస్తుందను విశ్వాసంతో ఒక్కసారిగా జరిగే తక్షణ ప్రక్రియ. ఇంక, శేషించిన మన క్రైస్తవ జీవితాన్ని, పాప జీవన విధానాలను విసర్జించి నూతన క్రైస్తవ జీవిత పద్ధతులను అలవర్చుకోవడానికి పరిశుద్ధాత్మ సంచారం ద్వారా జరిగే పవిత్రీకరణ పద్ధతి అంటారు (ఎఫెసీ 4:22-24).

**నీతిమత్వారోపణ, పవిత్రీకరణ జరగకుండ ఆపే ప్రయత్నం చేస్తూ నేడు "కర్ణపిశాచి" పోరాడుతున్నాడు**

మనుష్యుల ఆత్మల కోసం జరుగుతూ ఉన్న ఈ ఆత్మీయ పోరాటాన్ని మీరు రూఢిగా అర్ధం చేసుకోండి. అప్పుడు ఈ "కర్ణ పిశాచాలు" "అబద్ధ ప్రవక్తల" తో కలసి పనిచేయడం మీకు మరెంతో తేటగా అర్ధమవుతుంది.

రక్షణ (నీతిమత్వారోపణ) కార్యంలో దేవుడు మన యెడల యెలా కృప చూపుతున్నాడో చూద్దాం. మనలను పవిత్రీకరించు కార్యములో కూడ దేవుడు మన యెడల ఎలా కృపతో కార్యం కొనసాగిస్తున్నాడో కొద్దిగా చూద్దాం. అయితే ప్రతి విశ్వాసికి అవశ్యమైన ఈ కార్యము గూర్చి పరిశీలించునపుడు, ఆత్మ పోరాటం గురించి బాగా అర్ధం చేసుకోడానికి, మనం ఆలోచించవలసిన మేలైన ఒక ముఖ్య ప్రశ్న ఉంది.

**దేవుని వాక్యం చొప్పున, మనం విశ్వాసులుగా మారిన తరువాత, పోయి ఏదైనా ప్రత్యేకమైన "ఆత్మా"భిషేకం నిజంగా పొందాలా?**

ఇది యెంతో ముఖ్యమైన ప్రశ్న గనుక దీన్ని మరొక విధంగా చెబుతాను. క్రైస్తవ జీవితం జీవించడానికి మనంతట మనము, మన సొంత శక్తి ద్వారా అధిక శక్తి "పొందడం" అవసరమా? మనంతట మనం, పరిశుద్ధాత్మను లేక దేవుని అధికంగా పొందటం అవశ్యం అన్నది, సాచి కృప ముఖాన కొట్టడమూ, దేవుని అవమానపరచడమూ కాదా? దయచేసి ఈ విషయంలో కళ్ళు మూసుకోవద్దు (నిద్రపోవద్దు)! సరిగ్గా ఇక్కడే చెడు వేదాంతం సత్యము నుండి చీలి వేరవుతుంది. అందుచేత ఈ ప్రశ్న గురించి ముందుగానో లేక, నిజమైన పరిశుద్ధాత్మ యెలా కృపచేత మాత్రమే మనలో ఉంటాడో అనే దాని గూర్చి మనం అధ్యయనం చేయునప్పుడో, యోచించడం ముఖ్యం!

నిజమైన పరిశుద్ధాత్మ క్రియను తెలిసికొనడంలోని ప్రాముఖ్యతను మీరు గ్రహించాలని దీన్ని నేను పాక్షికంగా వివరిస్తున్నాను. ప్రజలు తమంతట తాము వెళ్ళి పొందే ఆత్మ పరిశుద్ధమైనది కాదు. ఒకవేళ మనంతట మనం ఏదో విధంగా దేవుని అధికంగా పొందిన యెడల, అప్పుడు కృప వెలుపల ఉంటుంది. మనంతట మనం పొందేది క్రియల మూలమైన నీతి, అది ఏ ఒక్కరినీ రక్షించదు. ఏమైనప్పటికీ, ఆత్మల లోకంలో ఏది నిజమైనదో తెలుసుకోడానికి మనం పరిశీలించవలసిన కొన్ని ముఖ్య ప్రశ్నలు ఇవే.

ఎంతకాలం?

# ఎలాగైనా అతన్నే పెళ్ళి చేసుకోవాలని...!

**(డా॥ పి. సతీష్‌కుమార్, కల్వరి టెంపుల్, హైదరాబాద్‌వారి రచన)**

రేఖ అటు చూడు ఎవరో క్రొత్త స్టూడెంట్‌లా ఉన్నాడు పలకరిద్దామా? అని అంది ప్రభావతి. మనం అతన్ని పలకరించడం కంటే అతనే మనల్ని పలకరించే విధంగా చేద్దాం అంటూ క్యాంటీన్‌కు వెళ్ళారు. అక్కడ ఒక మూల కూర్చుని కూల్‌డ్రింక్ త్రాగుతున్నాడు సురేష్ (క్రొత్త స్టూడెంట్). అతన్ని ఆట పట్టిద్దామని ఏ మిస్టర్! ఇది మేము కూర్చునే ప్లేస్ అని అంటుండగానే సారీ అంటూ లేచి వేరే ప్లేస్‌లో కూర్చున్నాడు సురేష్. అబ్బో! అమాయకుడిలా ఉన్నాడే! అంటూ రేఖవైపు చూసింది ప్రభావతి. రేఖ సూరేష్ వైపు తీక్షణంగా చూస్తూ ఉండిపోయింది.

ఏమో! అప్పుడే కలలు కంటున్నావా? అని వేళాకోలం చేసింది ప్రభావతి. చిరునవ్వి నవ్వి పదా! క్లాస్‌కి వెళ్దాం అని అంది రేఖ. సురేష్‌ని చూసినప్పుడల్లా వేళాకోలం చేయడం, అతని మెతకతనాన్ని ఆసరాగా తీసుకొని ఆట పట్టించటం చేస్తూ ఉండేది రేఖ. కానీ, ఇవేవి సురేష పట్టించుకునే వాడు కాదు. తన దారి తనది. అలా కొంతకాలం గడిచింది.

ఎవరినోట చూసినా సురేష్ పేరే, సురేష్ ఫోటోలతో కూడిన పోస్టర్స్. ఆ పోస్టర్స్ చూసిన రేఖకి కళ్ళు చెదిరిపోయాయి. కారణం టెన్నిస్ ఆటలో కాలేజికి గోల్డ్ మెడల్ తీసుకొని రావడమే కాకుండా స్టేట్ ఛాంపియన్ టైటిల్ సంపాదించాడు. ఇప్పుడు అప్పటి అమాయకుడు కాదు ఈ సురేష్. కాలేజీకి హీరో అయిపోయాడు. అతన్ని కలుసుకోవాలని, అతనితో మాట్లాడాలని ప్రయత్నం చేయని అమ్మాయి లేదు. ఆ కాలేజీ ప్రతి అమ్మాయికీ అతనంటే గొప్ప అభిమానం, అంతేకాకుండా అతను చూసి నవ్వితే చాలు! ఆ రోజు ధన్యమైపోతుందని తపించేవారు ఎంతమందో!

సురేష్‌ను ఏ అమ్మాయైనా ప్రేమించగలిగితే ఆమె ఆ కాలేజీకి హీరోయిన్ అవుతుంది. అనేకమంది అమ్మాయిలు ఎన్ని ప్రయత్నాలు చేసినా సురేష్ మనసును గెలుచుకోలేక పోయారు. అతని దారి అతనిది. సమయం వృధా చేసుకోడు. భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకొన్నవాడు. తనకు వున్న పేరుని చూసి ఎప్పుడూ గర్వించలేదు. మృధు స్వభావి. ఇన్ని మంచి లక్షణాలున్న వ్యక్తిని ఎవరు కాదంటారు? ఎవరు వదులుకుంటారు? అందుకే అనేకమంది అమ్మాయిలు అతనికి గ్రీటింగ్ కార్డ్స్ ఇచ్చేవారు, కాంగ్రాట్స్ చెప్పేవారు, కావాలని పలకరించేవారు. ఇదంతా చూసి ఏమైనాసరే అతన్ని సొంతం చేసుకోవాలని, అతన్ని పెళ్ళి చేసుకోవాలని ప్రతిజ్ఞ పూనింది రేఖ. గతంలో అతన్ని హేళన చేసింది, ఆట పట్టించింది. ఇంత గొప్ప వాడౌతాడని ఊహించక ఉన్న అవకాశాలన్ని పోగొట్టుకుంది. అయినా సరే! అతన్ని ప్రేమించి తీరాలి, అతన్ని ఒప్పించి తీరాలి. ఇంటికి ఉత్తరాలు రాయడం మానేసింది. తల్లిదండ్రుల్ని ఎప్పుడో మర్చిపోయింది. పుస్తకాలు చదవడం ఎప్పుడో మానేసింది. ఇప్పుడు సమస్తమూ సురేష్. పరీక్షలు కాదు పాస్ కావాల్సింది, తన ముందున్న ప్రేమ పరీక్షను పాస్ అవ్వాలి. ఉత్తరాలు రాసింది, గ్రీటింగ్ కార్డ్స్ పంపింది. అన్ని ప్రయత్నాలు చేసింది. సురేష్ కంట పడాలని, నేను అప్పటి చిలిపి రేఖను కాదని, ఇప్పుడు నిన్ను మనసారా ప్రేమించే అభిమానినని ఎన్నో చెప్పాలని ఆశపడింది. ఒకరోజు సురేష్ రేఖ వెనుక వస్తున్న ప్రొఫెసర్‌ని చూసి చిరునవ్వు నవ్వాడు. అంతే! తనని చూసి నవ్వాడని, తన ప్రేమ ఫలించ బోతుందని కలలు కంది. సురేష్ కోసం ఒంటరిగా స్కూటర్ స్టాండ్ దగ్గర ఎదురు చూస్తుంది. సురేష్ రానే వచ్చాడు. తన బైక్ తీసుకుంటుండగా... సురేష్! నీతో మాట్లాడాలి అని అంది. సురేష్ పెద్దగా పట్టించుకోలేదు. సురేష్! సురేష్! నేను చాలా ముఖ్యమైన విషయం నీతో మాట్లాడాలి. తన మనసులో వున్న మాట చెప్పడానికి ధైర్యం చాలక అటుగా తిరిగి, సురేష్! నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వు లేకుండా ఒక్క క్షణం కూడా బ్రతకలేను, నన్ను నమ్ము అంది. సురేష్ దగ్గర్నుండి జవాబు లేదు. తిరిగి చూసింది. అక్కడ సురేష్ లేడు. బైక్ స్టార్ చేయకుండానే రేఖను చూసి వేరే మార్గంలో బైక్ నడిపించుకుంటూ మెల్లగా వెళ్ళిపోయాడు సురేష్. అది

చూసిన రేఖకు దుఃఖం కట్టలు తెంచుకొని వచ్చింది. కుమిలి కుమిలి ఏడ్చింది. సురేష్‌కు ప్రేమ గీమ ఇవేమి పట్టవు. విలువైన తన జీవితాన్ని విలువతో నింపుకొని పదిమందికి ఉపయోగపడాలనేదే తన ఆశ. కానీ, అతన్ని ఎలాగైనా సరే ప్రేమించి తీరాలి, కట్టుకొని తీరాలి, దానికోసం ఏమైనా చేయాలి. తన రూంమేట్స్‌తో కలిసి పథకం వేసింది. చూడండి! నేను కిరోసిన్ ఒంటిమీద పోసుకుంటాను. మీరు సురేష్‌ని పిలవండి అతను వచ్చిన తరువాత నాతో నీన్ను ప్రేమిస్తున్నాను. నేను నిన్ను పెళ్ళి చేసుకుంటానంటే సరే! లేదా నిప్పంటించుకొని చచ్చిపోతానని బెదిరిస్తాను. సురేష్ మంచివాడు కాబట్టి తప్పక సరే అంటాడు! అని అంది. అంతా సరే అన్నారు.

సురేష్! సురేష్! అని తలుపులు కొట్టారు ప్రభావతి, ప్రతిమ. సురేష్ తలుపు తెరిచాడు. సురేష్ నువ్వు అర్జంటుగా మా హాస్టల్‌కి రావాలి. నువ్వు రాకపోతే ఘోరం జరిగి పోతుంది. దయచేసి కాదనకు అని బలవంతం చేశారు. వాళ్ళిద్దరితో సురేష్ బయలుదేరాడు. పరుగు పరుగున హాస్టల్‌కి వచ్చారు. అక్కడంతా అరుపులు, కేకలు, ఏడుపులు. ఏమైంది... ఏమైంది... అని సురేష్ అడిగాడు. రేఖ... రేఖ... నిన్ను బెదిరించి బలవంతానైనా నిన్ను ఒప్పించి పెళ్ళి చేసుకోవాలనుకుంది. తమాషాకు ఒంటిమీద కిరోసిన్ పోసుకుంది మా అందరి ముందు. సురేష్ వస్తే ఈ విధంగా అగ్గిపుల్ల వెలిగిస్తాను, అది ఆరిపోయే లోపల సురేష్ ఒప్పు కోవాలని.. ఒప్పుకుంటాడు కూడా! అని ట్రైల్‌గా అగ్గిపుల్ల వెలిగించింది. ఆ అగ్గిపుల్ల విరిగి మీద పడింది మా కళ్ళముందే... అంటూ భోరున ఏడ్చింది రూమ్మేట్. సురేష్ పరుగు పరుగున రేఖ రూమ్‌కు వచ్చాడు. పోలీసులు, ఫైర్ ఇంజిన్ వాళ్ళు పూర్తిగా కాలిపోయి మాంసపు ముద్దగా మిగిలిన రేఖ శరీరాన్ని బయటకు తీసుకొని వచ్చారు. కోరికల మనస్సు మూగబోయెను. యూనివర్సిటీ అంతా మౌనమాయెను.

ప్రియ చదువరీ! ఆశలు ఉండాలి కానీ, వాటికి హద్దులు ఉండాలి. ప్రేమంటూ, ప్రేమించానంటూ ఆ ప్రేమలు విఫలమై ఆత్మహత్యలు చేసుకున్న వారిని, జీవితంపై విరక్తి చెందిన వారిని ఎంతోమందిని చూస్తున్నాము కాని యౌవనం ఎంతో విలువైనది. ఆ వయసులో నువ్వు తీసుకునే తీర్మానాలు, వేసుకునే బాటలు నీ జీవిత గమ్యాన్ని ప్రభావితం చేస్తాయి గనుక మంచిగా చదువుకొని నీ తల్లిదండ్రులు నీ మీద పెట్టుకున్న ఆశలు అడియాశలు చేయక, ఆశ చూపి మోసం చేసే నేటి తరాన్ని నమ్మి, జీవితాన్ని నాశనం చేసుకోవద్దని మనవి చేస్తున్న మీ సతీషన్న.

నిన్ను కాదన్న వారిని కూడా ప్రేమించానంటూ కాళ్ళ వేళ్ళా పడక... నిన్ను ప్రేమించి, నీకోసం ప్రాణం ఇచ్చి నిన్ను బాగు చేయాలని నీ కూడా పడుతున్న యేసయ్యకు నేడే నీ జీవితాన్ని సమర్పించు.

"శాశ్వతమైన ప్రేమతో నిన్ను ప్రేమించుచున్నాను. గనుక విడువక నీ యెడల కృప చూపుచున్నాను" (యిర్మియా 31:3).



# పేరు లేని బానిస

దేవుడు అతి సామాన్యమైన మనుష్యుల ద్వారా అసాధారణ కార్యములు చేయించుకుంటాడు. బైబిలులో విద్యలేని పామరులతో కూడ గొప్ప కార్యాలు చేయించుట చాలా సంధర్బాలలో చూస్తాము. 2రాజులు 6వ అధ్యాయంలో వ్రాయబడిన ఒక పేరు లేని బానిసను మీ యొక్క దృష్టికి తేవాలనుకుంటున్నాను. 2వ వచనంలో ఇలా వ్రాయబడింది. "సిరియనులు గుంపుగుంపులుగా బయలు దేరి ఇశ్రాయేలు దేశము మీదికి పోయి ఉండిరి. వారచ్చట నుండి యొక చిన్నదాని చెరగొని తేగా, అది నయమాను భార్యకు పరిచారము చేయుచుండెను".

ఈ పేరులేని చిన్న బాలికను దేవుడు గొప్ప విధముగా వాడుకున్నాడు. సిరియా దేశపు యజమానురాలి దగ్గర పని చేస్తున్నా తన దేవుడిని, తన స్వంత దేశమును, తన ప్రజలను ఏనాడూ మరువలేదు. తన యజమానురాలి ప్రేమకు పాత్రురాలైందంటే ఎంత నమ్మకంగా చక్కగా పని చేసి యుంటుందో గ్రహించగలము. తన పరిస్థితినిబట్టి క్రుంగిపోకుండా ఆ పరిస్థితుల్లోనే తృప్తిగా, సంతోషంగా, బాధ్యతగా ఉంది. తను పూజించే తన ఇశ్రాయేలు దేవుడు తనను విడువడు ఎడబాయడు అనే విశ్వాసం మెండుగా ఉన్నందువల్ల సంతోషంగా ఉండి తన యజమానురాలి అభిమానం చూరగొంది.

ఈ చిన్న దాసి నయమాను అనే సిరియా రాజు సైన్యాధిపతి యొక్క భార్య దగ్గర పనికి నియమింపబడింది. దేవుని ప్రణాళికలో –ఈ నయమాను ఉన్నాడన్న సంగతి మొదటి వచనంలో కనబడుతుంది. "అతని చేత యెహోవాయే సిరియా దేశమునకు జయము కలుగుచేసి యుండెను" అనే వాక్యములో మనకు దేవుడు నయమానును ఏదో ఒక విషయంలో వినియోగించుకుంటాడు అనే సంగతి తెలుస్తుంది. ఈ చిన్న బాలిక ద్వారా ఎలీషా ప్రవక్తను నయమానుకు పరిచయం చేయాలని దేవుని ఆలోచనగా ఉంది.

3వ వచనంలో "షోమ్రోనులోనున్న ప్రవక్త దగ్గర నా యేలిన వాడుండవలెనని నేనెంతో కోరుచున్నాను; అతడు నా యేలిన వానికి కలిగిన కుష్ఠరోగమును బాగు చేయునని తన యజమానురాలితో అనెను"'. ఈ వచనము ధ్యానము చేసినపుడు ఈ బానిసలో ఉంటే చాలా లక్షణాలు మనకు స్పష్టమవుతున్నాయి. మొదటిగా ఆ అమ్మాయి ధైర్యం కనబడుతుంది. బానిసగా పరాయి దేశానికి చెరపట్టబడి తేబడిన అమ్మాయిలో చాలా దీనత్వము, భయము కనబడాలి. కాని ఇది చాలా ధైర్యవంతమైన ప్రతిపాదన. ఇలాటి సలహా ద్వారా పెద్దశిక్షకు గురయ్యే అవకాశం ఉంది. అయితే నిజమైన స్వస్థతా మూలం ఎక్కడుందో ఆమెకు తెలుసు. నయమాను క్షేమం నిమిత్తం ఆమెకున్న గాఢమైన శ్రద్ధను బట్టి ఆమె ధైర్యంగా తనకేమైనా పర్వాలేదని అనుకొని ఆ మూలం వద్దకు, అంటే ఏకైక నిజదేవుని చెంతకు తన యజమానిని నడిపించింది. ఈ చెప్పడంలో ఆ చిన్నది అచంచలమైన విశ్వాసం చూపించింది. సాధారణంగా మనము ఒకచోట ఉన్నప్పుడు, అక్కడ నుండి మనమేమి పొందగలమా అని ఆలోచిస్తూ ఉంటాము. కాని ఈ చిన్నది తను వాళ్ళకు ఏ విధంగా సాయం చేయగలనా అని ఆలోచిస్తుంది. తనకుండే మిడిమిడి జ్ఞానాన్ని ఇతరులకు ఉపయోగపడేటట్లు చేసింది.

ఈ చిన్నపిల్ల ఎంతో ఘనతగల తన యజమానికి సంపూర్ణ ఆరోగ్యం కూడా ఉండాలని కోరుకుంది. తన గొప్ప దేవుని మీద, తన దేశ ప్రవక్త మీద పూర్ణ విశ్వాసముంది కాబట్టి తన యజమాని తప్పక స్వస్థత పొందుతాడు అని తెలుసుకుంది. తన యజమాని ఆరోగ్యం కోసమైన భారము తన మీద మోపుకొని భారంతో ప్రార్థించి ఉంటుంది. ఆ అమ్మాయిలో ఒక బాధ్యతగల దేవుని బిడ్డ మనకు కనిపిస్తుంది. దేవుడు ఆ అమ్మాయికి తన యజమానురాలిని, ఆమె తన ద్వారా తన యజమానుని, ఆ దేశపు రాజును కూడా ఒప్పించగల జ్ఞానమును దేవుడు ఇచ్చాడు.

నయమాను ఆ చిన్న దాసి చెప్పిన సంగతి రాజుకు చెప్పగా సిరియా రాజు ఇశ్రాయేలు రాజునకు దూత చేత పత్రికను, విలువైన బహుమానములను పంపినాడు. 'నా సేవకుడైన నయమానునకు కలిగిన కుష్ఠరోగమును నీవు బాగు చేయవలెను' అనునది ఆ పత్రిక సారాంశము. ఇక్కడ

గమనించాల్సిన విషయమేమంటే ఇశ్రాయేలు రాజుకు తన రాజ్యములో ఉన్న ఎలీషా ప్రవక్త చాలా దైవజ్ఞానము కలిగి అద్భుతాలు చేయు శక్తి గలవాడనీ తెలీదు. ఒక చిన్న బాలికకు ఆయన సంగతి అర్థమయింది కాని రాజుకు అర్థము కాలేదు. ఆ రాజుకు ఏమి చేయాలో తోచక తన గుడ్డలు చింపుకున్నాడు. ఈ వార్త విన్న ఎలీషా ప్రవక్త నయమానును తన దగ్గరికి పంపమని రాజుకు వర్తమానము పంపాడు. తర్వాత నయమానును ఏడుసార్లు యొర్దాను నదిలో మునగమని ప్రవక్త చెప్పడమూ, ముందు ఒప్పుకోక పోయినా తర్వాత ఒప్పుకొని మునిగి స్వస్థత పొందడమూ జరిగింది. ఈ స్వస్థతవల్ల చాలా గొప్ప కార్యాలను దేవుడు జరిగించాడు.

ఒక అన్యుడైన నయమానుకు దేవుని దయవల్ల స్వస్థ పరచబడి దేవుని యెడలను ప్రవక్త యెడలను కృతజ్ఞత కలుగుతుంది. తన్ను తాను తగ్గించుకొని ఎలీషా దగ్గరకి కానుకలను తీసుకొని వస్తాడు. కానీ ఎలీషా కానుకలను స్వీకరించడు. నయమానుకు జీవముగల దేవుని గురించి ఒక గొప్ప సత్యము తెలుపబడింది. ఎలీషా దగ్గరకు వెళ్ళినప్పుడు గర్విష్టిగా, సిరియా రాజు యొక్క రాయబారిగా వచ్చి తిరిగి వెళ్ళినప్పుడు దీనహృదయంతో సిరియా రాజు ప్రజలకు మన నిజదేవుని గురించి ప్రకటించుటకు నిజ దేవుని రాయబారిగా వెళ్తున్నాడు. నయమాను మొట్ట మొదటిగా ఇశ్రాయేలుకు వెళ్ళడానికి ఒప్పుకోవడమే గొప్ప విషయం. ఎందుకంటే అది తన స్వంత దేవుళ్ళకు విముఖత చూపడమే. ఇందువల్ల తన స్వజాతీయుల విమర్శలకు గురి కావడము, తన దేశపు సైనిక వ్యవస్థను ఆపదలోకి నెట్టినట్లు అయింది. కాని స్వస్థతనొంది నిజదేవుని తెలుసుకున్న తర్వాత తన స్వజనులను గూర్చి తలంచలేదు. నయమాను ఎలీషాకు ఈ విధంగా చెప్పాడు 'చిత్తగించుము ఇశ్రాయేలులోనున్న దేవుడు తప్ప లోకమంతటియందును మరియొక దేవుడు లేడని నేను ఎరుగుదును' మరియు 'యెహోవాకు తప్ప దహనబలినైనను మరి యే బలినైనను ఇతరమైన దేవతలకు నేనికను అర్పింపను' అని తన దేశములో బలిపీఠము కట్టించు కొనుటకు మన్ను కూడా మోసికొని పోయాడు.

అన్యుడైన ఈ సిరియా దేశపు సేనాధిపతిలో ఈ గొప్ప కార్యాలు ఒక పేరులేని బానిస ద్వారా ఆ ప్రభువు జరిగించాడు. ఆ చిన్నది తను స్వంతగా స్వస్థత కలిగించలేక పోయినా ప్రార్థనల ద్వారా స్వస్థత కలిగించే వారి యొద్దకు తన యజమానుని పంపించగలిగింది. మనలో చాలామంది సువార్త ప్రకటించుటకు బిడియపడుతూ ఉంటారు. కనీసము దైవజనుల దగ్గరకి ఆశగల ప్రాణులను నడిపించగలిగితే పరోక్షంగ మనం కూడా దైవకార్యములు చేసిన వారమవు తాము. ఈ చిన్న బనిస పిల్లలాగా, మనము కూడా మన జీవితాలను వాడబడే దానికి దేవునికర్పించి మన కుటుంబా లనూ, బంధు మిత్రులనూ నిరీక్షణ, స్వస్థత, రక్షణ ఇచ్చే నిజదేవుని దగ్గరకు నడిపిద్దాం. సంతోషంగా దేవునికి మనలను మనము అప్పగించుకొని దేవుడిచ్చు సకల ఆశీర్వా దములు పొందుకుంటాము. దేవుడు మిమ్ములను దీవించును గాక! ఆమేన్.

**- బి. విమలారెడ్డి, హైదరాబాద్**




## ఎస్.యం.ఎస్. (వాయిస్/టెక్స్ట్) పరిచర్య

**ఎవరైనా ప్రతిరోజు దేవుని వాక్యము (టెక్స్ట్) ఉచితంగా పొందగోరినచో లేదా మీ ప్రియులకు పంపగోరినచో 9908822365 నెంబరును సంప్రదించగలరు.**

ప్రతిరోజు 'హన్నాకృప' పాఠకులకు, శ్రేయోభి లాషులకు, మిత్రులకు దేవుని వాక్యము SMS చేయుటకు సహకారము అందించుచున్న వారందరికి వందనములు. ఈ పరిచర్య ద్వారా ఎంతోమంది ఆత్మీయ మేలులు పొందుచున్నందుకు దేవునికి స్తోత్రములు చెల్లించుచున్నాము.



# అమృతధార

(కొండెపోగు బి. డెవిడ్ లివింగ్‌స్టన్)

## క్రైస్తవ్యం విశ్వదర్శనం

బైబిల్‌లోని మార్మికమైన అమృతధారను అన్వేషించ డానికి ముందు గ్రీకు తత్త్వవేత్తల ఆలోచనల్ని కొన్ని మీ ముందు ఉంచుతాను. గ్రీకుల తత్త్వశాస్త్రానికి ఆద్యుడు థేలిస్ మహాశయుడు. గ్రీకుల గురించి పౌలు భక్తుడు ఒక మాట చెబుతాడు.

"...గ్రీసు దేశస్తులు జ్ఞానమును వెదకుచున్నారు" (1కొరింథి 1:22). అయితే గ్రీసు దేశస్తులు వెదికే ఈ జ్ఞానం క్రీస్తే అని క్రీస్తు దేవుని జ్ఞానమని అపొస్తలుడైన పౌలు విశదీకరిస్తాడు. గ్రీసు దేశస్తుల తాత్విక జ్ఞానం గురించి కొద్దిగా ముచ్చటించుకుందాము.

తాత్త్వికుడైన థేలిస్ గ్రీకు నగరమైన మైలీటస్ నివాసి. ఈయనకి ఒక శిష్యుడు వున్నాడు. ఆతని పేరు అనగ్జిమాండర్, ఈ అనగ్జిమాండర్‌కు కూడా శిష్యుడు ఉండేవాడు. అతడిపేరు అనగ్జిమేనిస్. ఈ ముగ్గురు తత్త్వవేత్తల సిద్ధాంత సంప్రదా యాన్ని మైలీషియన్ స్కూల్ ఆఫ్ ఫిలాసఫీ అంటారు.

**ప్రపంచానికి ఏది మూలం?**

ఇంతకూ వీరేమన్నారు?

ఈ ప్రపంచానికి మూలం ఏదో వీరు అన్వేషించారు. ఈ ప్రపంచం ఎలా ఆవిర్భవించింది? మూల పదార్థమేది? దేనివల్ల ఈ బ్రహ్మాండం ఉద్భవించిందో బాగా అధ్యయనం చేసి థేలిస్ మహాశయుడు తేల్చి చెప్పిందేమంటే ఈ ప్రపంచానికి మూలం 'నీరు' అని, అయితే ఆయన శిష్యుడు అనగ్జిమాండర్ ఈ సిద్ధాంతాన్ని కొట్టిపారేస్తూ ఈ ప్రపంచానికి మూలం నీరు కాదు ఒక అజ్ఞాత పదార్థం అని సిద్ధాంతీకరించాడు.

ఇక అనగ్జిమేనిస్ అవేమీ కాదు, ఈ ప్రపంచం ఉద్భవిం చడానికి మూలం గాలి తప్ప మరేమీ కాదు అన్నాడు. ఇదంతా ఒక వెర్రితనంగా ఉన్నా ఇందులో సత్యం రేఖా మాత్రంగా ఇమిడి వుంది. వీరు పేర్కొన్న నీరు, అజ్ఞాత పదార్థం, గాలి సృష్టికర్త అయిన దేవుడికి సాదృశ్యంగా వున్నాయి. అదెలాగా అంటే–

కనిపించని, చూడలేని అజ్ఞాత పదార్థం బైబిల్లో పేర్కొన్న తండ్రియైన దేవుణ్ణి తలపిస్తే, శుద్ధీకరించేది ప్రాణాన్ని నిలిపేది జీవాన్ని కల్గించేది అయిన నీరు కుమారుడైన క్రీస్తును, గాలి ఇదీ కన్పించదు కాని, దీని శబ్దాన్ని వినగలం. ఈ గాలి పరిశుద్ధాత్మకు సాదృశ్యంగా వున్నాయి. అంటే ప్రపంచం వీరు ముగ్గురూ పేర్కొన్నట్లు అజ్ఞాత పదార్థం, నీరు, గాలికి సాదృశ్యంగా వున్న త్రియేక దేవుడి వల్లే కలిగింది. కనుక మైలీషియన్ స్కూల్ ఆఫ్ ఫిలాసఫీ పేర్కొన్న సిద్ధాంతంలో సత్యం అంతర్లీనంగా వుంది.

అయితే ఈ ముగ్గురు తత్త్వవేత్తల ధోరణి మాత్రం ఏనుగు ఎలా ఉందో వివరింపచూసే గుడ్డివాళ్ళ నివేదిక అవుతుంది. ఇందులో ఎవరి మట్టుకు వారు నిజమే చెప్పారు. ఎలాగంటే విశ్వ ఆవిర్భావం, సృష్టి అనేవి నీరు, అజ్ఞాత పదార్థం, గాలి సాదృశ్యము మాత్రమే. త్రియేక దేవుడే విశ్వకర్త, ఎందుకంటే యేసుప్రభువు తనను తాను జీవజలంగా జీవజల ప్రదాతగా ప్రకటించుకున్నారు. (నీరు).

తండ్రిని ఎవడును ఎన్నడునూ చూడలేదని కుమారుడైన క్రీస్తు ఆయనను బయలుపరిచాడని వేదోక్తి (అజ్ఞాత పదార్థం).

అపొస్తులుల కార్యాల్లో పరిశుద్ధాత్మ దేవుడు శిష్యుల మీదికి రావడానికి ముందు గొప్ప గాలి వంటి శబ్దం వినిపించిందని చూస్తాము. (గాలి).

సరే! ఇప్పుడు సాక్షాత్కరించిన అమృతధారను పరిశీలిద్దాం. "ఒక నది కలదు' అంటూ కోరహు కుమారులు కీర్తన 46:4లో పేర్కొన్న నది అనేక గ్రంధాల్లో మనకు దర్శనమిస్తుంది. యెహెజ్కేలు ప్రస్థావన. ఇప్పుడు యెహెజ్కేలు గ్రంథంలోని అపూర్వనది గురించి అమృతధార గురించి పరిశీలిద్దాం.

యెహెజ్కేలు గ్రంథం 47వ అధ్యాయాన్ని చదవండి. ఆత్మవశుడైనయున్న యెహెజ్కేలును దేవుడు మందిర గుమ్మము వద్దకు తోడుకొని వచ్చాడు. అక్కడ ఏమి కనబడింది? మందిరం తూర్పు ముఖంగా వుంది. మందిరపు గడప క్రింద నుండి నీళ్ళు తూర్పు దిశగా పారుతూ వున్నాయి. ఆ నీళ్ళు మందిరం నుండి వస్తున్నాయన్నమాట. అవి ఎక్కడ నుండి వస్తున్నాయో చూశాడు యెహెజ్కేలు. అవి బలిపీఠమునకు దక్షిణంగా కుడి ప్రక్క నుండి పారుతూ వున్నాయి. మందిరపు గడప గుండా సాగి తూర్పుదిశగా పారుతూ వున్నాయి. ఒక చిన్న పాయగా మొదలైన ఈ నీటి ధార రానురాను మహానదిగా

అవతరించింది. అది ఎక్కడికి పారుతూ వున్నదో అక్కడ జలచరములన్నీ బ్రతికెను అంటుంది వాక్యం!

బలిపీఠపు దక్షిణం వైపు నుండి మొదలై మందిరపు గడప క్రిందగా పారుతూ తూర్పు దిశగా సాగిన ఈ నది సిలువ బలిపీఠం వద్ద నుండి మొదలైన క్రీస్తు కరుణానదిని, రుధిర ధారను జ్ఞాపకం చేస్తున్నది. క్రీస్తు దివ్యనది.

గ్రంథంలో పేర్కొన్న ఈ నది తూర్పు దిక్కుగా అంటే సూర్యోదయ దిక్కుగా వెలుగుతీరం వైపు ప్రయాణించడం గమనార్హం. యేసు అనే అమృతధార వెలుగువైపు నడిపిస్తుంది. ఆ నది ప్రవహించిన చోట జలచరములన్నీ బ్రతికాయి. అలాగే క్రీస్తు అనే అమృతధారలో చేరిన జలచరాలు బ్రతుకుతూ నిత్యజీవాన్ని స్వతంత్రించుకుంటున్నాయి.

ఆత్మలో మృతులమైన మనమంతా ఈ అమృతధార మన మీదుగా ప్రవహించడం మూలంగా చిరజీవాన్ని అందుకున్నాం. యెహెజ్కేలు 47:10 ప్రకారం సకల జాతి చేపలును దానియందు (నది) బహు విస్తారముగా నుండును. నిజమే, ఈ అనాది అమృతధారలో అన్ని జాతులు, కులాలు, మతాలకు చెందిన మహా మహా మత్స్యాలెన్నో చేరిపోయాయి.

"...అటు తరువాత నేను చూడగా ఇదుగో ప్రతి జనములో నుండియు ప్రతి వంశములో నుండియు ప్రజలలో నుండియు, ఆయా భాషలు మాటలాడు వారిలో నుండియు వచ్చి, యెవడును లెక్కింపజాలని యొక గొప్ప సమూహము కనబడెను" (ప్రకటన 7:9). పై బైబిల్ వాక్యం రేపటి పరలోక దృశ్యాన్ని ఆవిష్కరిస్తున్నది. గొర్రెపిల్ల అయిన క్రీస్తును అనుసరించి ఆయన రక్తధారలో పునీతులైన అశేష భక్త జనవాహిని అది. అందులో ఎన్నో జాతుల, కులాల, తెగల సందోహం. అన్నీ ఆ అమృతధారలో చేరిన జీవితాలే!

క్రైస్తవ్యం మాలమాదిగల మతం కాదు. అది అనాది విశ్వధర్మం. నా జీవితకాలంలో అనేక కులాలకు చెందిన వాళ్ళు యేసువైపు తిరగటం చూస్తున్నాను. మా తెలుగు లెక్చరర్ ఒకాయన ఉండేవాడు. ఆయన మంచి కవి, రచయిత కులరీత్యా విశ్వబ్రాహ్మణుడు. వారికి మా నాన్నగారు ఎన్నోసార్లు వాక్యం చెప్పారు. ఇలా ఉండగా ఆయనకు శరీరంపై పెద్ద కణితి పెరిగింది. దాన్ని శస్త్ర చికిత్స చేసి తొలగించాలన్నారు డాక్టరు. ఆయనకు షుగర్ వ్యాధి ఉండటం వల్ల ముందు షుగర్ తగ్గాక ఆపరేషన్ అన్నారు. అన్నాళ్ళు ధీమాగా తిరిగిన మా మాస్టరుగారిని నిరాశ ఆవహించింది. ఎంతో కృంగిపోయారు.

ఒకరాత్రి చాలా స్పష్టంగా ఆయన ప్రభువు స్వరాన్ని విన్నారు. ప్రభువు స్పర్శతో కణితి చిత్రంగా తెల్లరేసరికి అదృశ్యమైంది. ఇపుడా విశ్వబ్రాహ్మణుడు క్రీస్తు అనే అమృత ధారలో జలచరమయ్యాడు.

క్రైస్తవ బోధను ఎగతాళి చేసే ఆయన మిత్రుడు కూడా ఇపుడు ప్రభు విశ్వాసి. నాయీ బ్రాహ్మణుడైన ఆయనదో కథ. ఆయన భార్య రక్తస్రావ వ్యాధితో బాధపడేది. డాక్టర్ల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. ఎంతో వేదనతో ఉన్న ఆ సోదరుడికి దర్శనంలో రక్తధారనంతా మూటకట్టి తీసుకెళ్తున్న హస్తాలు కనిపించాయి. ఆ హస్తాల్లో సిలువ మేకుల గుర్తులు. ఆ మరుసటి రోజే ఆ సోదరుడి భార్య స్వస్థత పొందింది. యిపుడు గుంటూరు జిల్లాలో ప్రభు పరిచర్యలో కొనసాగుతున్నారు. ఇలా ఎన్నో కులాల వాళ్ళు యేసు అనే జీవజల ప్రవాహంలో ఆనందిస్తున్నారు. భారతీయ క్రైస్తవ చరిత్రలో సిక్కువాడైన సాధుసుందర్‌సింగ్, భక్తసింగ్, పులిపాక జగన్నాధం, పురుషోత్తమ చౌదరి వంటి అగ్ర వర్ణస్తులు అక్తర్‌వంటి ముస్లిములు ఇలా ఎందరో ఈ అమృతధారలో తరించారు.


## గొప్ప ఆహ్వానము

ప్రతినెల రెండవ శుక్రవారము రాత్రి 10 గంటల నుండి ఉదయం 4 గంటల వరకు

# సంపూర్ణ రాత్రి ప్రార్థన జరుగును.

స్థలము : యు.సి.యల్.ఐ. చర్చి, బాప్టిస్ట్ ప్రెయర్ హాల్ దగ్గర, ప్రార్థన కొండ (ఒంగోలు కొండ), కొండమిట్ట, ఒంగోలు - 523 001

మీ వ్యక్తిగత, కుటుంబ అవసరతల కొరకు, అన్ని సమస్యల కొరకు ప్రార్థనలు చేయబడును

రండి కలిసి ప్రభుని ఆరాధించెదము.

(13వ పేజీ తరువాయి...)

నెలలు జీవించారు. తాను మరణశయ్యపై ఉన్నప్పుడు తనను చూసి వెళ్ళడానికి వచ్చిన ప్రతి ఒక్కరికి యేసుప్రభువును నమ్ముకోవాలని బోధించేవాడు. ఆయనే మోక్షానికి మార్గమని ఆయన తప్ప వేరొక మార్గంలేదని ఉద్ఘాటించి చెప్పేవాడు.

అలా మరణశయ్యపై ఉన్నప్పుడు 1958 డిసెంబర్‌లో క్రిస్మస్ సెలవులకని పులివెందులకు నా భర్తతోపాటు వచ్చాను. మేము దూరంగా వస్తుండగానే మా నాన్నకు 'కమలమ్మ వాళ్ళు వస్తున్నార'ని మా రాజారెడ్డి అన్న గట్టిగా సంతోషంగా చెప్పినప్పుడు వలలో పండుకొని వున్న మా నాన్న 'వల ఎత్తండి త్వరగా' అని అన్నాడు. మమ్మల్ని చూసి చాలా సంతోషపడ్డాడు. కాని నేను మాత్రం మా నాన్న చాలా బలహీనంగా మంచానికి అతుక్కొనిపోయి వుండుట చూచి దుఃఖముతో కళ్ళలో నీళ్ళు పెట్టుకుంటుంటే నన్ను వారించాడు. 'నేను పోయేది ఎక్కడికో కాదు, తండ్రి దగ్గరకు, అక్కడ ఈ లోక సంబంధమైన బాధలుండవు. ఎప్పుడూ దేవుని స్తుతిస్తూ వుండవచ్చు' అని చెప్పాడు.

నా బి.ఎ. పరీక్షలు ఎప్పుడని అడిగాడు. ఆ రోజుల్లో 2 సం॥ల డిగ్రీ కోర్సులో 2 సం॥ల పాఠాలు ఒకేసారి పరీక్షలు వ్రాయాలి. మార్చి 21న ప్రారంభమవుతాయని చెప్పినప్పుడు ఒక్క నవ్వు నవ్వి, 'ఆ సమయానికి నేను ఉండను. అయినా ఈ లోక సంబంధమైన పరీక్షలు అక్కడ వుండవు. ఏ బాదరా బందీ ఉండదని గట్టిగా చెప్పాడు. నేను చనిపోతే మీరెవ్వరూ దుఃఖించకూడదు. పాటలు పాడి దేవుని స్తూతిస్తూ నన్ను భూస్థాపన చేయాలి అని చెప్పారు.

మా నాన్న బ్రతికినంత వరకు ఉమ్మడి కుటుంబములో కుటుంబ ప్రార్థనలు ప్రతిరోజు ప్రొద్దుగుంకే సమయంలో తప్పని సరిగా నిర్వహించినారు. కుటుంబ సభ్యులలో ఒక్కరు కూడా తప్పిపోకుండా హాజరు కావాలనే ఆంక్ష ఉండేది. అడుక్కు తినే వారికి ఎప్పుడూ లేదు అని మొండి చెయ్యి చూపకూడదు. తప్పకుండా మన దగ్గరకు సహాయమునకు వచ్చే వారిని తృప్తిపరచాలని చెప్పేవాడు. అన్యాయంగా అర్జించుట తప్పని చెప్పేవారు. కూలి వారికి బట్వాడా చెల్లించే విషయంలో ఆలస్యం చేయరాదని చెప్పేవారు. ఏ పని చెప్పినా టక్కరగా చేయక సవ్యంగా చేసి పదికాలాల పాటు పదిమందికి ఉపయోగపడాలనేవాడు. కాంట్రాక్టు పనులలో ఎక్కువ లాభం ఆశించేవాడు కాదు. తన కష్టానికి ఫలితం మాత్రమే కోరుకునేవాడు (హెబ్రీ. 13:5).

మా నాన్నకున్న యేసుక్రీస్తునందలి విశ్వాసాన్నిబట్టి ఆయనకు నిత్యజీవం లభించిందని ధృడమైన నమ్మకం నాకుంది. ఆయన పిల్లలమైన మేమందరం ఆయన ప్రార్థనల వల్ల ఒక్కరు కూడా తప్పిపోకుండా అందరం ఆశీర్వదింప బడినాము. ఆయనను నేను ఇహలోక తండ్రిగా కాక దేవుని ప్రతినిధిగా గౌరవించినాను. ఆత్మ ఫలమైన ప్రేమ, సంతోషం, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వీకము, ఆశానిగ్రహము ఇవన్నీ ఆయనలో ఇమిడియున్నాయి. తన దగ్గరకు వచ్చే వాళ్ళందరి విషయంలో భారము కలిగి వారికి సువార్త చెప్పడమే కాకుండా వారి కొరకు, వారి ఆత్మల రక్షణ కొరకు ఎంతో భారంగా ప్రార్థించేవాడు.

మా నాన్న 30-01-1959న ప్రభువునందు నిద్రించాడు. మహాత్మాగాంధీగారు కూడా అదే రోజున జనవరి 30న చనిపోయినాడు. ఆ తేదీన గవర్నమెంటు స్కూళ్ళలో ఉదయం 11 గంటలకు గంట కొట్టి రెండు నిమిషాల తర్వాత మరల గంట కొట్టేవారు. ఆ రెండు నిమిషాలు నేను చూడని మహాత్మా గాంధీని తలంచకుండా చూచిన మా నాన్నను తలంచుకొనేదాన్ని. ఆయన నిబంధనను గైకొనుచు ఆయన కట్టడలనను సరించి నడచుకొనువారి మీద యెహోవాయందు భయభక్తులు గల వారి మీద ఆయన కృప యుగయుగములు నిలుచును. ఆయన నీతి వారి పిల్లపిల్ల తరమున నిలుచును (కీర్తన 103:17).

## దయచేసి గమనించండి

**ఆన్‌లైన్‌లో డబ్బులు పంపిన వారు వెంటనే 9866716506కు ఫోన్ ద్వారా మీ పేరు తెలియజేయండి**

# మత మార్పిడా? లేక మనసు మార్పిడా?

(అడ్వకేట్ ఎ.వై. ప్రభుదాసు, మంగళగిరి)

భారతదేశంలోని కొన్ని రాష్ట్రాలలో క్రైస్తవులపై హత్యలు మానభంగాలు మూకుమ్మడి దాడులు పెరిగిపోతున్నాయి. మత స్వేచ్ఛ ప్రాథమిక హక్కుగా మన రాజ్యాంగంలో గుర్తించబడింది. దాని ప్రకారం ఎవరైనా స్వేచ్ఛగా ఏ మతాన్నైనా స్వీకరించ వచ్చును. కానీ రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుకు భంగం కలిగించే విధంగా మతమార్పిడి అనే పదాన్ని సృష్టించి మసి బూసి మారేడు కాయ చేస్తున్నారు కొందరు మతోన్మాదులు. భారతీయ జనతా పార్టీ, విశ్వ హిందూ పరిషత్, రాష్ట్రీయ స్వయం సేవక్, భజరంగ్ దళ్ మరియు శివసేనలకు చెందిన కొద్దిమంది మాత్రమే మతమార్పిడి అనే అంశాన్ని పదే పదే ప్రకటిస్తున్నారు. దానికి కొందరు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా వారు వంత పలుకుతున్నారు. ప్రభుత్వం కూడా పట్టీపట్టనట్టుంటుంది. నిజానికి మతమార్పిడి అనేది ఒక వ్యక్తి ఇష్టానికి స్వేచ్ఛకు వ్యతిరేకంగా జరిగిందా లేదా అనే అంశాన్ని ఎవ్వరూ పరిశీలించడం లేదు. చట్టాన్ని మన చేతిలోకి తీసుకోవాలి? ఏ వ్యక్తి ఇష్టానికి లేదా స్వేచ్ఛకు వ్యతిరేకంగా బలవంతంగా ఎవరు ఎవరిని మతం మార్పినా అది నేరమే అవుతుంది. దానికి బాధ్యులైన వారిని శిక్షించవలసిందే. ఆ పని ప్రభుత్వ యంత్రాంగం చూస్తుంది. కానీ ప్రభుత్వ యంత్రాంగం చేయవలసిన పనిని మతోన్మాదులు చేయడం వలన చట్టాన్ని తమ చెప్పు చేతల్లో ఉంచుకోవాలనుకోవడమే. మతమార్పిడి చేసే దోషుల్ని మేమూ సమర్ధించము. వారిపై చట్టప్రకారం కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి సరైన సాక్ష్యా ధారాలు చూపించి వారిని నేరస్తులుగా గుర్తించి న్యాయస్థానం ద్వారా శిక్షించాలి. ఇంత పని చేయకుండా క్రైస్తవులపై మూకుమ్మడి దాడులు జరిపి మానభంగాలకు, హత్యలకు, పాల్పడడం భావ్యమా? ఇది నిజంగా చట్ట వ్యతిరేకం కాదా? మతస్వేచ్ఛ అనే ప్రాథమిక హక్కుకు వ్యతిరేకంగా ప్రవర్తించడం కాదా? ఒకవేళ నిజంగానే కొందరు క్రైస్తవులు మతమార్పిడి కొరకు కొన్ని తప్పులు చేశారే అనుకో, వారిని తరిమికొట్టి మానభంగా లకు, హత్యలకు పాల్పడుతున్న వారు కూడా నేరం చేసినట్లే కదా. ఇంత రాద్ధాంతం జరుగుతుంటే ఏ నక్సలైట్లు, విప్లవ సంస్థలు, కమ్యూనిస్ట్ పార్టీలవారు, పౌర హక్కుల సంఘాలు, మానవహక్కుల సంఘాలు ఎందుకు మౌనంగా ఉంటున్నాము. ఇది ప్రజల సమస్య కాదా? క్రైస్తవులు పౌరులు మానవులు కారా? సాక్షాత్తు రాజ్యాంగంలో ప్రసాదించబడిన ప్రాథమిక హక్కే హరించబడుతుంటే పౌర హక్కుల, మానవహక్కుల సంఘాలు ఏం చేస్తున్నాయి?

**రాజ్యాంగంలో ఏముందో పరిశీలిద్దాం**

భారతదేశ రాజ్యాంగ ప్రకారం మత స్వాతంత్రమనేది మనకున్న ఏడు రకాల ప్రాథమిక హక్కుల్లో ఒకటిగా ప్రకటించ బడింది. రాజ్యాంగంలో 25 నుండి 28 ఆర్టికల్ వరకూ మత స్వేచ్ఛ, స్వాతంత్ర్యం గురించి వివరించబడింది. అవి వరుసగా..

**ఆర్టికల్ 25 :** పరిశుభ్రత, నడవడిక, మంచితనము మొదలగు వాటికి ఈ భాగములో చెప్పబడివున్న ఇతరమైన వాటికి లోబడి, అందరూ తమ మనోభావము ప్రకారము నడచుకొనుటకు తగిన స్వతంత్ర్యం కలిగిన వారగుదురు. తమ తమ మతమును స్వీకరింప, స్వీకరించి వ్యాప్తి చేయుటకు అధికారము కలిగిన వారగుదురు.

**ఆర్టికల్ 26 :** పరిశుభ్రత నడవడిక మరియు మంచితనము మొదలగు వాటికి కట్టుబడి ఒక మతములో చేరిన వారు లేక మతము నుండి వైదొలగు వారును;

1) తమ మత ధర్మ సంబంధమైన సంస్థలు నెలకొల్పి నిర్వహించుకొనుటకును,
2) తమ మతమునకు సంబంధించిన వ్యవహారము లను తామే నిర్వర్తించుకొనుటకు,
3) ఆస్తులను పొందుటకును, అధికారంలో ఉంచుకొనుటకు,
4) అటువంటి ఆస్తులను చట్టప్రకారము నిర్వహించుటకును, అధికారము పొందిన వారగుదురు.

**ఆర్టికల్ 27 :** ఒక సూచించిన మతము లేక మతమునకు సంబంధించిన ఆచార వ్యవహారములను పరామర్శించుట కును, చేయుటకును, ఖర్చు చేయబడు ద్రవ్యమునకు పన్ను చెల్లించవలెనని ఎవరినీ నిర్బంధించకూడదు.

**ఆర్టికల్ 28 :** దీనిలో ఈ క్రింది 3 అంశాలు పేర్కొనబడినవి. అవి

1) ప్రభుత్వ నిధి నుంచి నిర్వహించబడు కళాశాలలందు ఏ విధమైన మత సంబంధమైన బోధనలు చేయకూడదు.

2) మత బోధనల కోసమే ధర్మ సంస్థలు లేక చందాల మూలముగా నెలకొల్పబడిన కళాశాలలు ప్రభుత్వనిధి సహాయంతో అవి నడచినను 1వ సెక్షన్‌లో ఉన్న వాటిని అనుసరించనక్కరలేదు.

3) ప్రభుత్వముచే అంగీకరించిన లేక ప్రభుత్వ సహాయముతో నడపబడుతున్న కళాశాలలందున్న వారికి... అటువంటి కళాశాలలు లేక వాటితో సంబంధముగల భవనములలో నడుపబడు మత బోధనలలోను లేక మత ఆచార వ్యవహారములలోను అటువంటి వ్యక్తిని లేక వారు మైనర్‌గా ఉన్నప్పుడు వారి యొక్క కస్టడీలో అనుజ్ఞలేనిది భాగము కావలయునని అడుగకూడదు.

పైన పేర్కొనబడిన 4 ప్రకరణములలో మత స్వేచ్ఛ, స్వాతంత్రము గురించి ప్రాథమిక హక్కుగా వివరించబడి నందున ఈ హక్కుపై భారతదేశములోని ఏ ప్రజలుగాని, ఏ ప్రభుత్వం కాని ఆటంకాలు కల్పించకూడదు. ఇంత చట్ట బద్ధంగా మత స్వాతంత్రపు హక్కు నిక్షిప్తమై యున్నప్పటికీ భారతదేశంలోని కొందరు మతోన్మాదులలో పాటు భారత ప్రభుత్వం కూడా ఆంక్షలు విధిస్తుంది.

వర్ణ వ్యవస్థే కారణమా?

ఎవరైతే యేసుప్రభువును నమ్మి విశ్వసించి మారు మనస్సు పొంది బైబిల్ పేర్కొన్న అంశాలను ఆచరిస్తారో వారే నిజమైన క్రైస్తవులు.

అయితే మన భారతదేశంలో వర్ణవ్యవస్థ ఆధారంగా కులవ్యవస్థ వేళ్ళూనుకుంది. ఒక మనిషిని స్పృశ్యుడిగా మరొక మనిషిని అస్పృశ్యుడిగా గుర్తించి అతని సమస్త హక్కులను స్వేచ్ఛను హరించిన చరిత్ర ప్రపంచంలో మరేదేశంలోనూ లేదు. బ్రిటీష్ వాళ్ళు భారతదేశానికి వచ్చినప్పుడు ఊరిబయట నివసించే వారి దుస్థితి చూసి ఆవేదన చెందారు. ప్రేమ, ఆప్యాయతతో ఆదరించారు. చెయ్యి చెయ్యి కలిపి తిరిగారు. ఈ దేశవాసులైన కొందరు ఈ దేశవాసులైన మరికొందరిని అంటరాదనే శాసనం చేసి, అంటరానివారుగా గుర్తించిన నేపధ్యంలో స్వయంగా తెల్లవారే వచ్చి చేతిని అంటుకుని, చేతిలో చేయి కలిపి, ఆ అంటరాని వారికి శుచి శుభ్రత నేర్పి, విద్యాబుద్ధులు చెప్పి, వైద్య సౌకర్యం, ఉద్యోగావకాశాలు కల్పిస్తే ఎవరు తమ మనసు మార్చుకోకుండా ఉంటారు? అప్పట్లో కేవలం బ్రాహ్మణులు మాత్రమే విద్యనభ్యసించారు. కాబట్టి వారిలో మనస్సు మార్చుకొన్న వారిని ఎంపిక చేసి ఈ దేశ విద్యావిధానాన్ని రూపొందించారు, దీనిలో ఎక్కడా బలవంతపు మతమార్పిడి లేదు. ఎవరి స్వేచ్ఛకు, ఇష్టానికి వ్యతిరేకంగా జరుగలేదు. ఒకవేళ అటువంటి బలవంతపు మతమార్పిడి అంగీకరించినా లేదా ఏదో దక్కుతుందని ప్రలోభపడి క్రైస్తవంలో చేరినా వారు నిజక్రైస్తవులు కారు. అలా చేర్పించిన వారు, ప్రలోభ పెట్టినవారు కూడా క్రైస్తవులు కారు. క్రైస్తవ్యంలో ఈ మాటే లేదు.

**మతమార్పిడి ముఖ్యమైతే తుపాకీ గురిపెట్టే వారేమో?**

నిజానికి బలవంతంగా మత మార్పిడి చెయ్యాలనుకుంటే బ్రిటీష్ వారు మనదేశాన్ని పరిపాలించిన రోజుల్లోనే దానికి పాల్పడేవారు. ఎందుకంటే రాజ్యాధికారం వారి చేతుల్లో ఉంది. తుపాకీ గురిపెట్టి కాల్చేస్తామని ఒక్క హుకుం జారీ చేసి ఉంటే భారతావని మొత్తం క్రైస్తవ్యంతో నిండిపోయేది. క్రైస్తవ్యం అనేది బలవంతపు మతమార్పిడికి గురి చేయలేదు. ప్రేమ, దయ, జాలి, కరుణ, కనికరము, ఆదరణ, ఆప్యాయత అనే లక్షణాలను పుణికి పుచ్చుకున్న ప్రపంచదేశాల క్రైస్తవులు ఈ దేశంలోని అంటరాని వారికి అక్కున చేర్చుకున్నారు. కుష్ఠురోగుల్ని స్పృశించారు. చెప్పడానికి వీలుకాని పుండ్లను కడిగి శుభ్రం చేశారు. అనారోగులను ఆప్యాయంగా పలకరించి వైద్య సేవలందిచారు. కేవలం బ్రాహ్మణ వర్గానికే పరిమితమైన విద్య సౌకర్యాన్ని భారతీయులందరికీ అందచేశారు.

**మదర్ తెరీసాకు భారతరత్న ఎందుకు ఇచ్చారు?**

వికలాంగులకు, గ్రుడ్డివారికి, మతిస్థిమితం లేనివారికి, వృద్ధులకు, విధవరాండ్రకు ఇంకా ఎన్నో సేవాకార్యక్రమాలు చేశారు, చేస్తూనే వున్నారు. అటువంటి క్రైస్తవులనా హత మార్చడం? ఏ దేశంలోనో పుట్టి ఈ దేశానికి వచ్చి పైగా కమ్యూనిస్ట్ రాష్ట్రంలో తన సేవల్ని ప్రారంభించి ప్రపంచం మొత్తంలోనే మదర్ తెరీసాగా గుర్తించబడిన మదర్ తెరీసా క్రైస్తవురాలే కదా. మదర్ తెరీసాను భారత ప్రభుత్వం గుర్తించి భారతరత్న బిరుదు ఇవ్వలేదా. అటువంటి భారతరత్న మదర్ తెరీసా బాటలో పయనిస్తున్న క్రైస్తవులపై ఊచకోతలెందుకు? ఆలోచించండి

మానవతావాదులారా! పౌరహక్కుల నేతలారా! విప్లవ

సంఘాల నాయకులారా! అభ్యుదయ వాదులారా! ఆలోచన పరులారా! మతమార్పిడా లేక మనస్సు మార్పిడా అన్న అంశంపై చర్చించండి. ఎవ్వరూ డబ్బుకోసమో, వైద్యం కోసమో, గేదెలు, ఇళ్ళు, పొలాలకోసమో తమ మతాన్ని మార్చుకోరు. అలా మార్చుకుంటే తమ స్వంత కుటుంబాలు, బంధువులు, స్నేహితులు, తమ కులస్తులు, సాటి కులస్తులు అతన్ని ఎన్నో ప్రశ్నలు వేస్తారు. వాటన్నింటికి సమాధానం చెప్పి అతను నిలబడాలంటే నూటికి నూరుపాళ్ళు అతని మనసు మారాలి. మతమార్పిడి కాదు మనసు మార్పిడే. మనసు మారితే తప్ప వారు నిలబడలేరు. నిజక్రైస్తవుడిగా కొనసాగలేరు. కావున మనసున్న మనుషులారా, ఆలోచించండి. మిమ్మల్ని ఏమైనా నొప్పించి ఉంటే అందుకు క్షమాపణ కోరుతున్నాం. మీరు మనసారా మమ్మల్ని క్షమించి భారతీయులందరూ నా సోదర సోదరీమణులన్న భారతీయ ప్రతిజ్ఞను గుర్తుంచుకొంటారని ఆశిస్తూ బైబిల్ బోధించిన అంశాన్ని ఆచరిస్తున్న క్రైస్తవ మార్గంలో పయనిద్దాం. నీవు నీ పూర్ణ హృదయముతోను, పూర్ణాత్మను, పూర్ణ వివేకముతోను, పూర్ణ బలముతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననే ప్రధాన ఆజ్ఞను, నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమింపవలెననే రెండవ ఆజ్ఞను పాటించిన వారే నిజమైన క్రైస్తవులు. ఈ రెండు ప్రధాన ఆజ్ఞలుగా ప్రభువే స్వయంగా మార్కు సువార్త 12:30,31 వాక్యములలో స్పష్టంగా చెప్పారు. వీటిని పాటించిన వారే నిజ క్రైస్తవులు. నిజం చెప్పాలంటే క్రైస్తవ్యం మతం కాదు. క్రీస్తు ప్రభువు ఏ మతాన్ని సృష్టించలేదు. ఆ మాట కొస్తే పరిశుద్ధ గ్రంథమని చెప్పబడుతున్న బైబిల్లోని 1029 పేజీల్లో క్రైస్తవమత మనే మాట ఎక్కడా వ్రాయబడలేదు.

బైబిల్లోని పాత నిబంధనలోనూ మరియు క్రొత్త నిబంధనలోని మొత్తం 66 గ్రంథాలలో క్రైస్తవమతం అనే పదం ఎక్కడా ఉచ్ఛరించబడలేదు. దేవుళ్ళ పేరుతో మతాలు సృష్టించి ఆ మతాలకు లేని పోని ఆచార సంప్రదాయాలు సృష్టించి కొందరు మతోన్మాదులు మతమార్పిడి అనే సాకుతో మారణకాండలు చేస్తున్నారు. దయచేసి క్రైస్తవం మతం కాదని ఇతర మతస్థులు గుర్తించాలి. మరి ముఖ్యంగా క్రైస్తవులు కూడా క్రైస్తవ్యం మతంకాదు మార్గమని గుర్తించాలి. క్రైస్తవులారాలా మీరు నిజమైన మారుమనస్సు పొందండి. క్రైస్తవేతరులారా మీరు పై అంశాలు గమనించి మీ మనస్సు మార్చుకోండి. నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమింపమనే యేసుప్రభువు చెప్పిన సిద్ధాంతాన్ని మనమంతా పాటిస్తే మన మధ్యలో గొడవలుండవు. మానభంగాలు, హత్యలూ అసలే ఉండవు. నేనే మార్గమును, సత్యమును, జీవమును అని యేసుప్రభువు స్పష్టంగా ప్రకటించారు. కాబట్టి మతమనే మాట ఇక్కడ వర్తించదు. కాబట్టి మతమే లేదు. మతమే లేనప్పుడు మతమార్పిడి అనే ప్రసక్తే లేదు. కావున మిత్రులారా గమనించండి మారణహోమాలు చేయకండి. మానవతా వాదులుగా మిగలండి. మతమార్పిడి కాదు మనసు మార్పిడి అని గమనించండి. మనల్నందరినీ ప్రభువు దీవించాడు కాబట్టే ఇంత వరకూ బ్రతికున్నాం. లేదంటే గత క్షణం వరకూ ఉండి ఊపిరి ఆగిపోయినవారు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారు బాధలతో ఆత్మహత్యలు చేసుకున్న వారూ ఎందరో ఈ లోకంలో లేకుండా పోయారు. మనమింకా ఉన్నామంటే ఆయన పుణ్యమే. అందువలన మనం ఒకరికొకరం ప్రేమించుకుంటూ శాంతి సమాధానంతో కలిసిసాగుదాం. బ్రతికున్నంత వరకు మనల్నందరినీ మనల్ని శత్రువుల్లా భావించిన వారిని కూడా కరుణామయుడైన ప్రేమామయుడైన యేసుప్రభువు ఇప్పుడు ఎల్లప్పుడూ, సదాకాలము కాపాడుగాక అని ప్రార్థన చేద్దాం.

## చందా వివరములు

హన్నాకృప పత్రిక ప్రతినెల 1వ తేదీన ఒంగోలులో పోస్టు చేయబడుతుంది. పత్రికకు వచ్చే సహాయము ప్రతి రూపాయిని మేము ప్రతినెలా పత్రికలో ప్రచురిస్తున్నాము. ఆ పట్టికను పరిశీలిస్తే పాఠకులైన చందాదారుల వలన ఈ పత్రిక నడిపించబడుట లేదని, ప్రభువును ప్రేమించిన బిడ్డలు ప్రభువుచే ప్రేరేపించబడి ఆర్థిక సహాయం చేస్తున్న వారి ద్వారా మాత్రమే ఈ పత్రిక నడిపించబడుతుందని తెలుస్తుంది. కనుక చందా వివరములను పత్రికలో ప్రచురించటం లేదు. ప్రేరేపించబడిన వారు ఆన్‌లైన్ ద్వారాగాని, మనియార్డరు ద్వారాగాని, స్వయముగా గాని అందించవచ్చును. అలా పంపిన వారు 9866716506 ద్వారా మాకు తెలియజేయ మనవి. – చీఫ్ ఎడిటర్

# సువార్తలలోని యేసు కథ

88

సూర్యోదయమైనప్పుడు సూర్యుడు తన కిరణాలను ముందు బేతనీయ గ్రామము మీద కుమ్మరించి, ఒలీవల కొండను చూడటానికి పైకి లేచినప్పుడు యెరూషలేమునకు తూర్పుదిశలో ఉండిన హేరోదు దేవాలయము మీద తాకగానే తెల్లని పాలరాళ్ళ దేదీప్యమానంగా వెలిగే దీపములాగ కనిపిస్తాయి.

సొలొమోను దేవాలయము ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి బయలుదేరి. దేవుడు వారికి స్వాస్థ్యముగా ఇచ్చిన దేశములోనికి ప్రవేశించి దాని స్వాధీనపరచుకొనిన సుమారు 400 సంవత్సరాలకు కట్టబడింది. అది కట్టబడిన సుమారు 400 సంవత్సరాలకు దేవుని దాసుడైన బబులోను రాజైన (యిర్మీయ 27:6) నెబుకద్నెజరు ద్వారా నేలమట్టము కావించబడినది. తర్వాత సుమారు 400 సంవత్సరాలకు రాజైన మహా హేరోదుచే సొలొమోను దేవాలయపు డిజైన్‌తో కట్టబడింది. యేసుప్రభువు మానవునిగా ఈ భూమి మీద సంచరించేటప్పుడు చూచినది ఇదే.

ఎదోమీయుడైన హేరోదు యూదుల ప్రాపుకోసం మరియమ్నే అనే ఇశ్రాయేలీయులురాలిని వివాహం చేసుకొని దేవాలయాన్ని కట్టటం ప్రారంభించారు. యేసుప్రభువు ఈ లోకానికి రావడానికి 16 సంవత్సరాల నుండి దాన్ని కట్టనారంభించి యేసుప్రభువు సేవ ఆరంభించేటప్పటికి ఇంకా నగిషీ పని చేస్తూనే ఉన్నారు. మహా హేరోదు చనిపోయిన 30 సం॥లు లకు కూడా దాని అది కట్టబడుతూనే ఉంది. దాని ప్రధాన యాజకుడు కూడా రాజముద్రలేని మహారాజు భోగము అనుభవిస్తుంటాడు.

యేసు ఆ దేవాలయమును యెరూషలేములో ఉన్న రోజులన్నీ చూస్తున్నాం. ఈ రోజు మాత్రం ఆయన ఆవేదన చెంది 'ఓ యెరూషలేమా! యెరూషలేమా! నీవు ప్రవక్తల్ని చంపావు. దేవుడు నీ దగ్గరకు పంపిన వాళ్ళను నీవు రాళ్ళతో కొట్టావు. కోడి తన పిల్లల్ని దాని రెక్కల క్రింద దాచినట్లే నేను నీ సంతానాన్ని దాయాలని ఎన్నోసార్లు ఆశించాను. కాని నీవు అంగీకరించలేదు. అదిగో చూడు పాడుబడిన మీ ఇంటిని మీకొదిలేస్తున్నాను. ప్రభువు పేరట రానున్నవాడు ధన్యుడు. అని నీవనేదాక మళ్ళీ చూడనని చెపుతున్నాను అని దాని వద్దనుండి వెళ్ళిపోయేటప్పుడు ఆయన శిష్యులు ఆయన దగ్గరకు వచ్చి ఆ దేవాలయపు కట్టడాన్ని ఆయన దృష్టికి తెచ్చారు.

ఇవన్నీ చూస్తున్నారుగా, ఇది సత్యం. రాయి మీద రాయి నిలువకుండా వాళ్ళు అన్నీ పడగొడ్తారు అని మరలా ఒలీవల కొండకు వెళ్ళి కూర్చున్నాడు యేసు మాటలు అప్పుడ విన్న వారందరూ ఆశ్చర్యపోయి యుండవచ్చును. ఇంత పెద్ద బండలు ఎవరు పడగొట్టగలరు? అనుకొని ఉండవచ్చు. ఆయనను ఎగతాళి చేసియుండవచ్చును. కాని యేసు ఈ లోకంలో నుండి పరమునకు వెళ్ళిన తర్వాత 40 సంవత్సరాలకి అప్పటి యేసు శిష్యులనబడిన వారినందరి మీదకు శ్రమల ద్వారా కుప్ర, ఫినీషియా, అంతియొక పట్టణాల వరకు దేవుడు వారిని పంపించి వేసిన తర్వతనే రోమా అధికారి వాస్పషియస్ కుమారుడు టైటస్ ద్వారా యెరూషలేము గోడలు పడగొట్టబడి, యెరూషలేము దేవాలయము నేలమట్టము చేయబడింది. అదే స్థానములో ఇప్పుడు మనం చూస్తున్న మసీదు కట్టబడింది. శృంగార దేవాలయము నేడు మనుషులు మరలా కట్టబడటానికి వీలు లేకుండా మసీదు కట్టబడింది. అదే డోమ్ ఆఫ్ రాక్.

యేసును సిలువ వేయబడటానికిగాను, ఆ నీతిమంతుని రక్తాపరాధము మా మీద మా పిల్లల మీద ఉందుగాకని చెప్పిన యూదుల మాట నెరవేర్చుటకు టైటస్ యెరూషలేము వీధులలో చీలమండలం లోతున ప్రవహించిన యూదుల రక్తంలో నడిచాడు. యేసు ఒలీవల కొండమీద కూర్చున్నాడు. ఆయన శిష్యులు ఆయన యొద్దకు ప్రత్యేకంగా వచ్చి 'చెప్పండి, ఇవి ఎప్పుడు సంభవిస్తాయి. మీరు రావడానికి ముందు, ఈ యుగం అంతమవటానికి ముందు ఏ సూచన కనిపిస్తుంది' అని అడిగారు. యేసు సమాధానంగా 'మిమ్ముల్నెరూ మోసం చేయ కుండా జాగ్రత్తపడండి. ఎందుకంటే చాలామంది నా పేరట వచ్చి నేనే క్రీస్తును అని చెప్పుకుంటూ అనేకుల్ని మోసం చేస్తారు. యుద్ధాలను గురించి, యుద్ధ వదంతులను గురించి విన్నప్పుడు మీరు దిగులు పడకండి. ఇవి తప్పక సంభవిస్తాయి. కాని అంతం అప్పుడే రాదు. దేశం మీదికి దేశము యుద్ధానికి వస్తుంది. పలు ప్రాంతాలలో కరవులు భూకంపాలు సంభవి స్తాయి. ప్రసవ వేదనలు ఆరంభం అయ్యాయన్నమాట' అన్నాడు.

North East West South వార్తలు

## హైదరాబాద్‌లో పాస్టర్ల బృందంపై దాడి

హైదరాబాద్ శివారు మంగళ్‌ఘాట్ పోలీసు స్టేషన్ పరిధిలోని జి.ఆర్.గుడాలో పాస్టరుపైనా, ప్రార్ధనా బృందంపైనా ఆరెస్సెస్ గుండాలు 2008 డిసెంబరు 23వ తేదీ రాత్రి పదిగంటలు దాటిన తర్వాత దాడి చేశారు. వీరు ప్రేయర్ పవర్ చర్చి అనే సంస్థకు చెందిన వారని పేర్కొనబడింది.

దాడిలో గాయపడిన పాస్టర్లు ఏబెల్, జేమ్స్, పీటరు కొండయ్య, బి.నరసింగ్‌రావులను ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో చేర్చారు. ఆ తర్వాత వారిని రామనగర్‌లోని సౌమ్య నర్సింగ్‌హోంకు తీసుకువచ్చారు. మంగళ్‌ఘాట్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ముగ్గురు దుండగులను పోలీసులు అరెస్టు చేశారు.

## కరీంనగర్ జిల్లా గ్రామంలో పాస్టరుపై బి.జె.పి. గుండాల దాడి

కరీంనగర్ జిల్లా ఓదెల మండలంలోని గుంపుల గ్రామంలో పాస్టరు ఎత్తి యాకోబును బి.జె.పి. గూండాలు గత జనవరి 16వ తేదీ రాత్రి కొట్టడం జరిగింది. యాకోబు ఇండియా మిషన్‌లో సేవకుడుగా పని చేస్తున్నారు. ఈయన 16వ తేది రాత్రి 12 గంటల వేళ ఇంటిలో వుండగా బి.జె.పి. గుండాలు వచ్చి తలుపు తట్టారు. ఆయన వెళ్ళి తలుపు తెరవగానే ఎదురుగా ముసుగులు వేసుకున్న ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తులు కనిపించారు. మారు మాట్లాడకుండా వారు పాస్టరును కొట్టటం ప్రారంభించారు. యేసుక్రీస్తు ఫోటోను క్రిందకు విసిరేసి, దాన్ని తగులబెట్టారు. ఇంట్లోని వస్తువులను, బట్టలను తగులబెట్టారు. ఇంటి బయటకు వచ్చి కేకలు వేశారు. గ్రామంలో పాస్టర్లు ఎవరూ వుండరాదని హెచ్చరించారు. సెలవులకని యాకోబు భార్య, పిల్లలు భువనగిరి వెళ్ళారు. ఇంట్లో ఆయన ఒంటరిగా వున్నారు. ఆ ప్రాంతంలో ఆయన వున్న ఇల్లు దూరంగా వుంది. గాయపడిన పాస్టరును గ్రామస్థులు ఆసుపత్రిలో చేర్చారు. జనవరి 17వ తేదీన పాస్టరు యాకోబు, మరికొందరు కలసి పోట్‌కపల్లిలోని పోలీస్ స్టేషన్ వెళ్ళి దాడి గురించి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత అయిదుగురు బి.జె.పి గూండాలను అరెస్టు చేయడం జరిగింది. అయితే ఈ దాడిలో తమ పార్టీ వారెవరూ లేరని జిల్లా బి.జె.పి. నాయకులు బుకాయించారు.

## ఒరిస్సాలో విస్తరించిన సంఘ్ పరివార్ సంస్థలు

ఒరిస్సాలో సంఘ్ పరివార్ బాగా విస్తరించింది. 1999 జనవలో ఆస్ట్రేలియా దైవజనుడు గ్రహంస్టెయిన్స్ హతసాక్షి అయిన తర్వాత గడచిన పదేళ్ళకాలంలో సంఘ్ పరివార్ సంస్థలు విజృభించాయి. 2008 ఆగష్టులో ఫాదర్ బెర్‌నార్డ్‌డిగాల్ హతసాక్షి అయ్యారు. ఒరిస్సాలో ఆరెస్సెస్ ప్రస్తుతం ఒక లక్షా యాభైవేలమంది సభ్యులతో ఆరువేల శాఖలు కలిగివుంది. అలాగే విశ్వహిందూ పరిషత్‌కు ఒక లక్షా పాతికవేలమంది సభ్యులున్నారు. భజరంగ్‌దళ్ 200 శాఖలు 50వేల సభ్యత్వం కలిగివుంది. అధికారంలో వున్న బి.జె.పికి నాలుగు లక్షల యాభైవేల మంది కార్యకర్తలు వున్నారు. మహిళా సంఘమైన దుర్గావాహినికి 117 బ్రాంచీలు వున్నాయి. వీటిలో ఏడువేలమంది సభ్యులున్నారు. రాష్ట్రీయ సేవికా సమితికి 80 కేంద్రాలున్నాయి. కార్మిక సంఘమైన భారతీయ కిసాన్ (రైతు) సంఘ్ వంద బ్లాకు ఏరియాలలో 30వేల సభ్యత్వాన్ని కలిగివున్నది.